

టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం

అనకాపల్లి టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఈ నెల 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఆయా తేదీల్లో ఉచిత బస్ సౌకర్యం కల్పిస్తున్నట్టు డీపీటీవో కె.పద్మావతి తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టికెట్‌ను చూపించి సొంతూరు నుంచి పరీక్షా కేంద్రానికి, పరీక్ష రాసిన తరువాత తిరిగి ఇంటికి వెళ్లేందుకు పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డనరీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతిస్తున్నామన్నారు. బస్సు ఎక్కినప్పుడు హాల్ టికెట్ తప్పనిసరిగా చూపించాలన్నారు.

కృషి, పట్టుదలతో విజయ పథం

ఉన్నత విద్యను అభ్యసించడానికి సొంతూరు నుంచి రోజూ 12 కి.మీ.లు ప్రయాణం



విజయకృష్ణన్, కలెక్టర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం

- సాధారణ కుటుంబం నుంచి ఐఏఎస్‌కు ఎంపిక
- నిరాడంబర జీవితానికి ఆమె నిదర్శనం
- సామాన్య మహిళగా అందరితో కలివిడి
- తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల కష్టాలను స్వయంగా తెలుకుంటున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్
- మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం



రావికమతం మండలంలో గిరిజన గ్రామానికి వెళ్లడానికి నడుచుకుంటూ కొండ ఎక్కుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

కలెక్టర్ కె.విజయకృష్ణన్... జిల్లా ప్రజలకు పరిచియం అవసం లేని వ్యక్తి. పరిపాలన పరంగా ఒక జిల్లాకు అధిపతి అయినప్పటికీ సాధారణ మహిళలా అందరితో కలిసిపోవడం ఆమె నిరాడంబరత్వానికి నిదర్శనం. తమిళనాడు రాష్ట్రంలోని శివగంగ జిల్లా కుమారపట్టి గ్రామంలో ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబంలో ఆమో జన్మించారు. తండ్రి విద్యా శాఖలో సూపరింటెండెంట్. ఆమె చిన్నతనం నుంచే ఒక లక్ష్యంతో ముందుకు సాగారు. కృషి, పట్టుదలతో ఉన్నతస్థాయికి ఎదగాలని పరితపించారు. అనుకున్న లక్ష్యాన్ని చేరుకొనేందుకు రోజూ స్వగ్రామం నుంచి జిల్లా కేంద్రం శివగంగ వరకు 12 కిలోమీటర్లు ప్రయాణించి ఉన్నత విద్యను అభ్యసించారు. వ్యవసాయ విద్యలో డిగ్రీ పట్టా పొందిన విజయకృష్ణన్.. 2013లో సివిల్ సర్వీసు పరీక్షలు రాసి, ఉత్తమ ర్యాంకు సాధించడంతో ఐఏఎస్‌ను ఎంచుకున్నారు. శిక్షణ పూర్తయిన తరువాత ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు ఎంపిక చేయడంతో అప్పటి నుంచి రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పలు హోదాల్లో విధులు నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సబ్ కలెక్టర్‌గా, ఉమ్మడి కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఏపీ టూరిజం సీఈఓగా, రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పడిన తరువాత బాపట్ల జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అనకాపల్లి జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వచ్చారు.

ఒక సాధారణ కుటుంబంలో పుట్టి, ఉన్నత లక్ష్యంతో కష్టపడి చదివి అనుకున్నది సాధించిన ఆమె నేటి తరం మహిళలకు ఆదర్శంగా నిలుస్తారు. కలెక్టర్ అయినప్పటికీ ఒక సాధారణ మహిళగా అందరితో కలిసిపోయే మనస్తత్వం ఆమె సొంతం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో విజయకృష్ణన్ సబ్ కలెక్టరుగా పనిచేస్తున్న సమయంలో ఆమె భర్త, ఐఏఎస్ అధికారి దినేశ్‌కుమార్ అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఐటీడీఏ పీఓగా పనిచేశారు. అప్పట్లో గర్భవతిగా ఉన్న ఆమె రంపచోడవరం ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ రోగుల మాదిరిగా పురుడు పోసుకొని నిరాడంబర జీవితానికి నిదర్శనంగా నిలిచారు. కలెక్టర్ హోదాలో అధునాతన సదుపాయాలున్న కార్పొరేట్ ఆస్పత్రిలో చేరే అవకాశం ఉన్నా.. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు చేయించుకుని సర్కార్ వైద్యశాలల్లో కూడా మౌలిక వసతులు బాగున్నాయని సంకేతాలు ఇచ్చారు.

అనకాపల్లి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ పథకాలను ... మిగతా 8వ పేజీలో

నేటి నుంచి పీ4 సర్వే

పేదరికం లేని సమాజ స్థాపనే ధ్యేయం

- స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంగా ఇంటింటా సమాచారం సేకరణ
- రంగంలోకి గ్రామ/ వార్డు సచివాలయాల సిబ్బంది
- 28వ తేదీలోగా పూర్తి

అనకాపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజ స్థాపనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రైవేటు భాగస్వామ్యంతో పీ4 సర్వే ప్రక్రియను శనివారం నుంచి ప్రారంభించనున్నది. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంగా రానున్న ఐదేళ్లలో పేదరిక నిర్మూలనకు, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దిశానిర్దేశంగా నిలిచిన 'ఫ్రేమ్ వర్క్'లో జీరో పావర్టీ పీ4 పాలసీ అత్యంత ప్రాధాన్యత అంశగా పరిగణించి ఈ సర్వేకు శ్రీకారం చుట్టింది. పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చడం, జీవన ప్రమాణాల్లో అట్టడుగు స్థాయిలో వున్న 20 శాతం మంది పేదలను గుర్తించడం ద్వారా పేదరికాన్ని దూరం చేయాలన్నది పీ4 సర్వే ఉద్దేశం. జిల్లాలో 552 గ్రామ/ వార్డు సచివాలయా సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు జరగనుందని కలెక్టర్ విజయకృష్ణన్ వెల్లడించారు. ఇంటింటా సర్వే చేయడం ద్వారా పేదల అవసరాలను గుర్తించి వారి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించనున్నారు. సర్వే సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 27 రకాల ప్రశ్నలకు సమాధానం చెప్పించడం ద్వారా పేదరికంలో ఎంతమంది ఉన్నారనే దానిపై ఒక అంచనా వేయనున్నారు. సిబ్బంది సేకరించిన సమాచారాన్ని ప్రత్యేక యాప్‌లో పొందుపరచనున్నారు. ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో ఈ సర్వే నిర్వహించనున్నారు. అయితే ప్రభుత్వ పథకాల అమలు, అనర్హుల తొలగింపు వంటి అంశాలతో ఈ సర్వేతో ఎటువంటి సంబంధం ఉండదని, ప్రతిఒక్కరూ సర్వే బృందానికి సమాచారం అందించి సహకరించాలని జిల్లా అధికారులు కోరుతున్నారు.

కిడ్నీ వ్యాధి బాధితులకు ఊరట

ఎన్టీఆర్ ఆస్పత్రిలో డయాలసిస్ యూనిట్
ఐదు పడకలతో ఏర్పాటు

- పది రోజుల్లో అందుబాటు లోకి రానున్న సేవలు
- జూన్ నాటికి క్రిటికల్ కేర్ యూనిట్‌లో మరో ఐదు బెడ్స్‌తో డయాలసిస్ కేంద్రం



ఎన్టీఆర్ ఆస్పత్రిలో డయాలసిస్ యూనిట్

అనకాపల్లి టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో కిడ్నీ సంబంధ వ్యాధులతో బాధపడుతున్న వారు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న డయాలసిస్ యూనిట్ సేవలు స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో మరికొద్ది రోజుల్లోనే అందుబాటులోకి రానున్నది. వాస్తవంగా గతంలో టీడీపీ అధికారంలో వున్నప్పుడే డయాలసిస్ యూనిట్ మంజూరైంది. పరికరాలు కొనుగోలు చేసే సమయానికి ప్రభుత్వం మారిపోయి వైసీపీ అధికారంలోకి వచ్చింది. వైద్యానికి పెద్ద పీట వేస్తున్నామని వైసీపీ పాలకులు చెప్పుకోవడమే తప్ప ఐదేళ్ల కాలంలో డయాలసిస్ యూనిట్‌ను అందుబాటులోకి తీసుకురాలేకపోయారు. ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించి, మంత్రిగా కూడా పనిచేసిన గుడివాడ అమర్‌నాథ్.. డయాలసిస్ యూనిట్ ఏర్పాటు గురించి పలుమార్లు మాట్లాడారే తప్ప కార్యరూపం దాల్చలేదు.

ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనకాపల్లికి ఎన్టీఆర్ వైద్యాలయంలో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో చండీగఢ్‌కు చెందిన రాహి కేర్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థతో వైద్యాలయం అధికారులు ఒప్పందం చేసుకున్నారు. గత నెలలో పరికరాల ఏర్పాటు పనులు ప్రారంభం అయ్యాయి. ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. మిషన్లు, బెడ్స్ ఏర్పాటు చేశారు. వారం లేదా పది రోజుల్లో డయాలసిస్ యూనిట్ సేవలు అందుబాటులోకి వస్తాయని వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు చెబుతున్నారు. రోజుకు 15 మంది కిడ్నీ రోగులకు డయాలసిస్ చేసే అవకాశంవుంది. ఐదు పడకలతో మూడు షిఫ్టులుగా కిడ్నీ సంబంధ వ్యాధి బాధితులకు సేవలు అందిస్తారు.

అనకాపల్లి మండలంలో మొండిపాలెంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారు ఎక్కువ మంది వున్నారు. అలాగే మామిడిపాలెం, మరికొన్ని గ్రామాల్లో కూడా బాధితులు వున్నారు. వీరంతా ప్రస్తుతం విశాఖ కేజీహెచ్‌కు వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నారు. అనకాపల్లిలో డయాలసిస్ యూనిట్ అందుబాటులోకి వస్తుందని ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో పది రోజుల్లో డయాలసిస్ సేవలు ఇక్కడే పొందవచ్చన్న సమాచారంతో బాధితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, ఎన్టీఆర్ వైద్యాలయంలో ఐదు బెడ్స్‌తో డయాలసిస్ యూనిట్ త్వరలో అందుబాటులోకి వస్తుందని, ఇంకా వైద్యాలయానికి ఎదురుగా నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్‌లో మరో ఐదు బెడ్స్‌తో డయాలసిస్ వార్డు ఏర్పాటవుతున్నదని చెప్పారు. ఇది జూన్ నెలాఖరునాటికి అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

ఏటికొప్పాక లక్కబొమ్మలను తిలకించిన రాష్ట్రపతి



ఢిల్లీలో ఏటికొప్పాక లక్కబొమ్మల స్టాల్‌ను సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు బొమ్మల ప్రాధాన్యతను వివరిస్తున్న కళాకారుడు పెదపాటి శరత్

ఎలమంచిలి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం జరుగుతున్న 'వివిధత్తా కా అమృత్ మహోత్సవ్' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఏటికొప్పాక లక్కబొమ్మల స్టాల్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్వయంగా సందర్శించినట్టు హస్త కళాకారుడు పెదపాటి శరత్ తెలిపారు. ఏటికొప్పాక హస్తకళాఖండాలను ఢిల్లీలో ప్రదర్శించే అవకాశం తనకు రావడంతో స్టాల్‌ను ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ స్టాల్‌ను సందర్శించిన రాష్ట్రపతికి ఏటికొప్పాక లక్కబొమ్మల చరిత్ర, ప్రాధాన్యత గురించి వివరించినట్టు చెప్పారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఏటికొప్పాక హస్తకళల గురించి రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రస్తావించడం ఎంతో ఆనందంగా వుందన్నారు.

వెంకన్న ఆలయానికి చేరిన ఆభరణాలు



స్వామివారి ఆభరణాల పెట్టెకు హారతి ఇస్తున్న ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు

నక్కపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):

ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం పటిష్ఠ పోలీస్ బందోబస్తు మధ్య విశాఖ ట్రెజరీ కార్యాలయం నుంచి శ్రీవారి బంగారు ఆభరణాలను ఇక్కడకు తీసుకువచ్చారు. ఉత్సవాల సందర్భంగా ఉభయ దేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవమూర్తులను వజ్ర, వైఢూర్యాలు, బంగారు ఆభరణాలు, కాసుల పేర్లు, వజ్రాలతో పొదిగిన బంగారు కిరీటాలను అలంకరిస్తారు. 10వ తేదీ తెల్లవారుజాము నుంచి సంపూర్ణ స్వర్ణాలంకరణలో ఉపమాక వెంకన్న భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయానికి చేరిన ఆభరణాల పెట్టెకు ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు హారతి ఇచ్చారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లో భద్ర పరిచారు. ఇక్కడ సాయుధ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సీఎస్ఆర్ నిధులు మెక్కేశారు!

చెరువుల్లో పూడికతీత పేరుతో దుర్వినియోగం చేసిన వైసీపీ నేతలు

- గత ప్రభుత్వంలో ఏషియన్ పెయింట్స్ నుంచి రూ.కోటికిగాపైగా విడుదల
- వినియోగంలో లేని చెరువుల్లో మట్టి తీత పనులు
- తవ్విన మట్టిని సైతం అమ్ముకుని సొమ్ము చేసుకున్న వైనం



పూడికతీత పనులకు రూ.38 లక్షలు ఖర్చు చేసిన దుప్పితూరు కూనిశెట్టి బలిజవాని చెరువు

అచ్యుతాపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు కంపెనీలు గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు కేటాయించిన లక్షలాది రూపాయలను గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు తమ జేబుల్లో వేసుకున్నారు. సాగునీటి చెరువుల అభివృద్ధి పేరుతో ఒక ఘనపు మీటరు తవ్వి, వంద మీటర్లు తవ్వినట్టు బిల్లులు మంజూరు చేయించుకున్నారు. కొన్నిగ్రామాల్లో వినియోగంలో లేని చెరువుల్లో సైతం అరకొరగా పనులు చేసి నిధులు మింగేశారు. స్థానిక ప్రత్యేక ఆర్థిక మండలిలో వున్న ఏషియన్ పెయింట్స్ కంపెనీ కేటాయించిన సీఎస్ఆర్ నిధులు దుర్వినియోగమే ఇందుకు ఒక ఉదాహరణ.

ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు కంపెనీలు తమ నికర లాభాల్లో కనీసం రెండు శాతం సొమ్మును సామాజిక బాధ్యత కింద సామాజిక, ఆర్థిక, వ్యవసాయ, పర్యావరణ అభివృద్ధికి సంబంధించి ఖర్చు చేయాలి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు ద్వారా 2013లో చట్టం చేసింది. ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజడ్)లోని పలు కంపెనీలు తమ నికర లాభాల్లో రెండు శాతం సొమ్మును జిల్లా కలెక్టర్ ద్వారా చుట్టుపక్కల గ్రామాల్లో మౌలిక సదుపాయలకు సంబంధించిన పనులు చేపడుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు తమ పరిధిలో అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వాలని ఆయా కంపెనీలను కోరుతుంటారు. కంపెనీలు ఇచ్చిన ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్ పరిశీలించి ఆమోద ముద్ర వేస్తారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు ఎస్ఈజడ్‌లోని ఏషియన్ పెయింట్స్ కర్మాగారం ఇచ్చిన నిధులను చెరువుల అభివృద్ధికి కేటాయించుకుని అరకొరగా పనులు చేపట్టి చాలా వరకు స్వాహా చేశారు.

దుప్పితూరు పంచాయతీలో సుమారు 22 ఎకరాల విస్తీర్ణంలో కూనిశెట్టి బలిజవాని చెరువు వుంది. ఇందులో పూడిక తీసి, వినియోగంలోకి తేవడానికి ఏషియన్ పెయింట్స్ యాజమాన్యం రూ.38 లక్షలు మంజూరు చేసింది. వైసీపీ నాయకులు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి పనులు చేపట్టారు. చెరువు గట్టు పటిష్ఠం పేరుతో చెరువులో మట్టిని తవ్వి, నిర్మాణంలో వున్న కంపెనీల అవసరాలకు అమ్ముకున్నారు. వాస్తవంగా ఈ చెరువు కింద కొంతకాలం నుంచి ఒక్క ఎకరా కూడా సాగుభూమి లేదు. గతంలో ఆ చెరువు నుంచి 500 ఎకరాలకు నీరు అందేది. ఎస్ఈజడ్ కోసం చెరువు కింద వున్న సాగుభూములను ఏపీఐఐసీ సేకరించింది. తరువాత వివిధ కంపెనీలకు స్థలాలు ... మిగతా 8వ పేజీలో

టీచర్ల సీనియారిటీ జాబితాలో తప్పులు

జడ్పీ మేనేజ్‌మెంట్‌లోకి వచ్చిన ఎయిడెడ్ టీచర్ల పేర్లు గల్లంతు

- రోస్టర్ కమ్ మెరిట్ జాబితాలకు భిన్నంగా సీనియారిటీ ఖరారు
- సీనియర్ల కంటే ముందు జూనియర్ల పేర్లు
- డీఈవో కార్యాలయంలో ఒక ఉద్యోగి తీరుతోనే ఇబ్బందులు
- ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరం



విశాఖ డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయ్

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):

వచ్చే నెలలో బదిలీలు, పదోన్నతుల కోసం పాఠశాల విద్యా శాఖ తయారుచేసిన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో తప్పులు దొర్లాయి. ఈ జాబితాలో జడ్పీ యాజమాన్యం పరిధిలోకి వచ్చే ఎయిడెడ్ ఉపాధ్యాయుల పేర్లు కనిపించడం లేదు. అదేవిధంగా సీనియర్ల కంటే జూనియర్ల పేర్లు ముందుండడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. కీలకమైన రోస్టర్ కమ్ మెరిట్ జాబితాకు భిన్నంగా దీనిని రూపొందించారని టీచర్లు మండిపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో జడ్పీ, మునిసిపాలిటీ, ఎయిడెడ్, ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 15 వేల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. సర్వీస్ సీనియారిటీ ప్రకారం పదోన్నతులు ఇవ్వాలి. అయితే ఈ విషయంలో ప్రతిసారి తప్పులు జరగడం, టీచర్లు ఆందోళన చేయడం పరిపాటిగా మారింది. అటువంటి గందరగోళాలకు తావులేకుండా అన్ని యాజమాన్యాల పరిధిలో కేడర్ వారీగా సీనియారిటీ జాబితాలు తయారుచేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. దీని ప్రకారమే వచ్చే నెలలో పదోన్నతులు, బదిలీలు చేపడతామని, భవిష్యత్తులో ఇవ్వబోయే పదోన్నతులు ఉంటాయని పేర్కొంది. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ జిల్లాల వారీగా జాబితాలు రూపొందించింది. జిల్లాల విభజన జరిగినా ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగానే సీనియారిటీ జాబితా తయారుచేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా జాబితా తయారీలో తప్పులు దొర్లాయని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఎయిడెడ్ పాఠశాలలను బలవంతంగా మూసివేసి అక్కడి టీచర్లను జడ్పీ/మునిసిపల్ పాఠశాలలకు బదిలీ చేశారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి జడ్పీ/మునిసిపల్ పాఠశాలలకు వచ్చేంత వరకు వీరి సర్వీస్ వివరాలు సంబంధిత ఎయిడెడ్ యాజమాన్యం/డీఈవో ... మిగతా 8వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శని)	6.09
సహరి (ఆది)	4.55

పెదఉప్పలంలో నీతి ఆయోగ్ బృందం పర్యటన



పెదఉప్పలంలో సర్వే చేస్తున్న నీతి ఆయోగ్ టీం సభ్యురాలు

ఎస్.రాయవరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఉప్పలం గ్రామంలో నీతి ఆయోగ్ రీసెర్చ్ సర్వే బృందం శుక్రవారం పర్యటించింది. ఫీల్డ్ మేనేజర్ వికాస్ మల్కర్ ఆధ్వర్యంలో ఐదుగురు బృంద సభ్యులు గ్రామంలో పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ఆరా తీశారు. లబ్ధిదారులు చెప్పిన విషయాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ మాట్లాడుతూ శనివారం వమ్మవరం గ్రామంలో నీతి ఆయోగ్ సర్వే టీం పర్యటించి సర్వే నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్వే టీం సూపర్‌వైజర్ సంధ్యారాణి, సభ్యులు భానుచందర్, లోకేష్, లక్ష్మి, జి.సంధ్య, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఎరకయ్య, వెలుగు ఏపీఎం శివప్రసాద్, ఏవో సౌజన్య, హౌసింగ్ డీఈ విధేయుడు, సర్పంచ్ కోశెట్టి రమణ పాల్గొన్నారు.

నక్కపల్లిలో కేజీబీవీ విద్యార్థుల 2కే రన్

నక్కపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నక్కపల్లి కేజీబీవీ బాలికలతో 2కే రన్‌ను కేజీబీవీ ప్రత్యేకాధికారిణి షేక్ సలీమా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా హక్కులపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.లలిత అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయడం నేరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ ప్రతినిధులు దుర్గారాణి, వై.లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నక్కపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు సబ్ స్టేషన్, గొడిచెర్ల ఫీడర్ పరిధిలో విద్యుత్ నిర్వహణ మరమ్మతు పనులు చేపట్టనున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా వుండదని ఈఈ రాజశేఖర్, ఏఈ కృష్ణ చెప్పారు. చిన దొడ్డిగల్లు, ముకుందరాజుపేట, రమణయ్యపేట, డొంకాడ, జి. జగన్నాథపురం, చీడిక, రేవళ్ల కొత్తూరు, తిరుపతిపాలెం, దోసలపాడుల్లో విద్యుత్ సరఫరా వుండదన్నారు.

విద్యార్థినుల్లో చైతన్యం రావాలి

పాయకరావుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు భయం వీడి ఏ సమస్య ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొనే విధంగా వారిలో చైతన్యం తేవడం ఎంతో అవసరమని సీఐ జి.అప్పన్న తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పోలీసులు పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు దంగల్ సినిమాను ప్రదర్శించి, వారిలో చైతన్యం కలుగచేసేందుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పురుషోత్తం, పాఠశాల హెచ్ఎం భవానీ తదితరులు పాల్గొన్నారు.

మూలజంపలో మెగా మెడికల్ క్యాంప్ రేపు

రాంబిల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూలజంప గ్రామంలో ఈనెల 9న విశాఖపట్నం అల్లూరి విజ్ఞాన కేంద్రం, శారదా ట్రస్టు ఆధ్వర్యంలో మెడికవర్ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు తెలిపారు. ఆరోజు ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మెడికల్ క్యాంప్ జరుగుతుందన్నారు.

టీచర్ నుంచి హోం మంత్రిగా..

- ఇదీ వంగలపూడి అనిత ప్రస్థానం
- ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్సాహం
- వైసీపీ పాలనకు వ్యతిరేకంగా గళమెత్తి ఫైర్‌బ్రాండ్‌గా మారిన అనిత



నక్కపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆమె ఒకప్పుడు టీచర్.. రాజకీయాల్లోకి రావాలన్న ఆలోచన వున్నప్పటికీ సహకరించని పరిస్థితులు.. ఆమెకు వున్న పరిజ్ఞానం, విద్యార్థతను చూసి నేనున్నానంటూ తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చారు. తాను టీచర్‌గా పనిచేసిన నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రెండోసారి కొవ్వూరు నుంచి ఓటమి పాలైన డీలా పడలేదు. ఎన్నో అవాంతరాలు ఎదురైనా అప్పజెప్పిన పనిని సమర్థతతో చేయగలిగారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గొంతెత్తేందుకు ఎందరో వెనుకడుగు వేసినా ఆమె తన పదునైన వాగ్ధాటితో, నేరుగా జగన్‌పైనే అస్త్రశస్త్రాలు సంధించిన లేడీ ఫైర్‌బ్రాండ్‌గా పేరు తెచ్చుకున్నారు. 2024 ఎన్నికల్లో రెండోసారి గెలవడంతో కీలకమైన పదవి లభించింది. ఆమె హోం మంత్రి వంగలపూడి అనిత. అంతర్జాతీయ మహిళా దినోత్సవంపై ఆమె అభిప్రాయాలివి.

రాజకీయాల్లో మహిళలను ప్రోత్సహించి, చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించిన మహారాజు ఎన్‌టీఆర్. అందుకే ఆయన స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చాను. నన్ను ప్రోత్సహించి మొదటిసారి టిక్కెట్ ఇచ్చి ఎమ్మెల్యే చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మా తండ్రి, పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలకు రుణపడి వుంటా. భవిష్యత్ బాగుంటుందనే ఒకే ఒక ఆశతో నిరంతరం శ్రమించాలి. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు రక్షణగా ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం శక్తి యాప్‌ను ఆవిష్కరిస్తారు. ఈ సందర్భంగా మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలను ఆమె తెలియజేశారు.

బార్క్ ప్రహరీ పనులను అడ్డుకున్న రావిపాలెం గ్రామస్థులు

- పరిహారంతోపాటు ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్
- పనులు నిలిపి వేసిన అధికారులు



బార్క్ ప్రహరీ పనులను అడ్డుకుంటున్న రావిపాలెం గ్రామస్థులు

అచ్యుతాపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పరిహారంతోపాటు ఆర్ఆర్ ప్యాకేజీ ఇచ్చినంత వరకు బార్క్ ప్రహరీ నిర్మాణం జరగడానికి వీలులేదని రావిపాలెం గ్రామస్థులు పట్టుపట్టడంతో పనులను అధికారులు శుక్రవారం నిలిపివేశారు. వివరాల్లోకి వెళ్తే..

మండలంలోని దోసూరు పంచాయతీ రావిపాలెం గ్రామానికి చెందిన 600 ఎకరాలు బార్క్ కోసం ఏపీఐఐసీ 2014లో సేకరించింది. అప్పట్లో 400 జిరాయితీ భూములు ఎకరాకు రూ.18 లక్షలు చొప్పున పరిహారం ఇచ్చారు. డి పట్టాదారులతోపాటు సాగుదారులకు ఇంతవరకు పరిహారం ఇవ్వలేదు. రావిపాలెంలో 200 కుటుంబాలున్నాయి. వీరందరి భూములను ఏపీఐఐసీ సేకరించింది. కేవలం ఐదెకరాల పరిధిలో గ్రామం మాత్రమే మిగిలి ఉంది. సర్వం కోల్పోయినందున ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని గ్రామస్థులు ఆది నుంచి పోరాడుతున్నారు. ఇంతవరకు అధికారులు ఎటూ తేల్చలేదు. దీంతో గ్రామస్థులు కూడా మిన్నకుండిపోయారు. ఇప్పుడు ప్రహరీని నిర్మించడానికి శుక్రవారం అధికారులు సన్నద్ధమయ్యారు. దీనిని గ్రామస్థులు అడ్డుకున్నారు. ప్రహరీ నిర్మిస్తే తాము గ్రామం నుంచి బయటకు వచ్చే మార్గమే ఉండదని, తమకు ముందుగా పునరావాసం కల్పించిన తర్వాతే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే డి.పట్టా, సాగు దారులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని, రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఐదు సెంట్ల భూమిని పునరావాసం కింద ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామస్థులు అడ్డుకోవడంతో అధికారులు పనులను తాత్కాలికంగా నిలిపి వేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, బంటుపల్లి అప్పారావు, రావి అప్పలనాయుడు, కర్రి నాగేశ్వరరావు, మండల నూకరాజు, గొర్లె తాతబాబు, ఉల్లింగల సంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఉపమాక వెంకన్న పుష్కరిణి, పెద చెరువు గట్లపై ఐరన్ ఫెన్సింగ్



పెద్ద చెరువు గట్టుపై ఏర్పాటు చేసిన ఐరన్ ఫెన్సింగ్

నక్కపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):ఈనెల 9 నుంచి ప్రారంభం కానున్న ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల కోసం టీటీడీ అధికారులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. నక్కపల్లి, ఉపమాక ప్రధాన రహదారికి ఆనుకుని స్వామివారి పుష్కరిణి, మరొక పెద్ద చెరువుంది. పిల్లలు, వృద్ధులు చెరువుల్లోకి దిగే వీలు లేకుండా చెరువు గట్లపై ఇనుప ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. శ్రీవారి కల్యాణోత్సవాలు సందర్భంగా 20 రోజులపాటు జాతర జరుగుతుంది. సుగంధ ద్రవ్యాల వ్యాపారం కూడా రూ కోట్లలో సాగుతుంది. అనేక వస్తువులు, తినుబండారాలను విక్రయించే దుకాణాలు కూడా ఏర్పడతాయి. అందుకే 20 రోజుల పాటు అమ్మకాలు సాగించే విధంగా వ్యాపారులు దుకాణాలు నిర్మించుకుంటున్నారు.

వెంకన్న కల్యాణానికి రండి

- కలెక్టర్ సహా పలువురికి ఆహ్వానం



కలెక్టర్ విజయ కృష్ణన్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కూటమి నాయకులు

నక్కపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మార్చి 10 జరగనున్న ఉపమాక వెంకన్న వార్షిక కల్యాణోత్సవానికి తరలి రావాలంటూ పలువురు పెద్దలు,అధికారులకు శుక్రవారం కూటమి నాయకులు ఆహ్వానపత్రికలు అందజేశారు. జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్‌కు కూటమి నాయకులు వెంకటేశ్, కొప్పిశెట్టి బుజ్జి, కురందాసు నూకరాజు, గింజాల లక్ష్మణరావు, కోసూరి శ్రీను, తోలేటి శ్రీను ఆహ్వానపత్రికను అందజేశారు. అదేవిధంగా మాజీ స్పీకర్ యనమల రామకృష్ణు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా, విశాఖ జిల్లాల్లో పలువురు శాసనసభ్యులు, మాజీ మంత్రులు, కూటమి పెద్దలు, ప్రభుత్వశాఖల జిల్లా అధికారులకు ఆహ్వానపత్రికలను అందజేశారు.



ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న దృశ్యం

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ : డీపీవో శిరీషారాణి



శానిటేషన్ సిబ్బందికి ప్రత్యేక ఆదేశాలిస్తున్న డీపీవో శిరీషారాణి

నక్కపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉపమాక స్వామి వారి కల్యాణోత్సవాలు ముగిసే వరకూ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని డీపీవోఆర్ శిరీషారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె ఉపమాక ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామరాజుతో మాట్లాడారు. ఇప్పటికే ఉపమాకలో పలు పంచాయతీల నుంచి గ్రీన్ అంబాసిడర్లను తీసుకువచ్చి శానిటేషన్ పనులు చేపడుతున్నామని ఎంపీడీవో చెప్పారు. గ్రీన్ అంబాసిడర్లకు ఆమె స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా చెత్త, వ్యర్థాలు లేకుండా శానిటేషన్ పనులు చేపట్టాలన్నారు. ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లోని గ్రీన్ అంబాసిడర్లకు డ్యూటీలు వేయాలని ఆదేశించారు. ఆమె వెంట సర్పంచ్ వీరబాబు, సెక్రటరీ జయప్రకాశ్ ఆలయ మాజీ ఛైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు, జగదీశ్వరరావు, వాసు తదితరులున్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి : సీనియర్ సివిల్ జడ్జి విజయ



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ

ఎలమంచిలి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పోక్సో తదితర చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి. విజయ అన్నారు. శుక్రవారం స్థానిక మునిసిపల్ కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీ, డ్వాక్రా మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి విజయ మాట్లాడుతూ ఇటీవల కాలంలో చిన్నారులపై అత్యాచారాలు జరుగుతున్నట్టు వార్తలు చూస్తున్నామని, వారికి రక్షణగా పోక్సో యాక్ట్ అమల్లోకి వచ్చిందన్నారు. 18 ఏళ్లలోపు వారు ఈ చట్టం కింద రక్షణ పొందవచ్చునన్నారు. బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించకూడదన్నారు. అంతకుముందు మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, కమిషనర్ ప్రసాదరాజు, ఏజీపీ డి. వెంకట్రావులు పలు విషయాలను సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దూళి నూకరాజు, న్యాయవాది పీవీ. రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆర్.ఒ.సి.నెం. 91/2025/ఎ1 తే.07-03-2025 ది

బహిరంగ వేలం ప్రకటన

యలమంచిలి పురపాలక సంఘం

యలమంచిలి పురపాలక సంఘంనకు సంబంధించిన 2025-2026 సం॥నకు అనగా తే.01.04.2025 ది నుండి తే.31.03.2026 ది ఈ దిగువ తెలిపిన గుత్తులు తే.15-03-2025ది ఉదయం గం॥లకు 11.30 కమిషనరు వారిచే గాని, లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని పురపాలక సంఘం ఆవరణలో బహిరంగ వేలం వేయబడును. హెచ్చుపాట పై మొత్తం పాట పై 18% జి.ఎస్.టి చెల్లించవలెను. వేలం పాటలో పాల్గొనదలచిన వారు నిర్ణీత సమయంలో డిపాజిట్ చెల్లించి మరియు సాల్వెన్సీ సర్టిఫికెట్‌తో పాటు ఇ.సి. ఒరిజనల్ డాక్యుమెంట్స్ దాఖలు చేసి వేలంపాటలో పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది. ఇతర వివరములకు ఆఫీసు పనిచేయు వేళలో రెవిన్యూ విభాగములో తెలుసుకొనవచ్చును.

వ.నెం.	వేలం వివరము	ధరావత్తు రూ.లు	సాల్వెన్సీ ధృవీకరణ ప్రతం
1.	రోజువారి వారపు సంత మరియు పశువుల సంత ఆశీలు వసూలు చేసుకొను హక్కు తేది.01-04-2025 నుండి 31-03-2026 వరకు	రూ.5,00,000/-	రూ.5,00,000/-
2.	మేకల కబేళాలో ఆశీలు వసూలు చేసుకొనే హక్కు తేది.01-04-2025 నుండి 31-03-2026 వరకు	రూ.10,000/-	రూ.20,000/-

షరత్తులు :

1. వేలం పాటలో పాల్గొనదలచిన వారు వేలం పాటకు తప్పనిసరిగా స్థిర ఆస్తుల పై సాల్వేన్సీ సర్టిఫికెట్ తో పాటు ఇ.సి తీసుకొని రావలెను వేలంపాటలో సాల్వెన్సీ క్రింద ఎట్టి పరిస్థితులలోను డబ్బు స్వీకరించబడదు. గుర్తింపు పొందిన జాతీయ బ్యాంక్ ఎచ్చట నుండి అయిన బ్యాంక్ గ్యారంటీ అనుమతించబడును మరియు సాల్వెన్సీ యొక్క ఆస్తి ఒరిజనల్ డాక్యుమెంటు తీసుకొని రావలెను యలమంచిలి తహశీల్దారు హోదాకు తక్కువ కాని అధికారి నుండి రూ.5,00,000/-లు మోతుబారి ధృవపత్రం తీసుకొనిరావలెయును.
2. వేలం పాట ఖాయపడినవారు సబ్‌రిజిష్టర్ ఆఫీసు వారి రేట్లును అనుసరించి రిజిష్టర్ అగ్రిమెంటు చేయించి ఇవ్వవలయును మరియు 1/3 వంతు పాట మొత్తం చెల్లించవలెను.
3. వేలం పాటలో పాల్గొనదలచిన వారు ఈ పురపాలక సంఘంనకు ఎటువంటి బకాయిలు లేనట్లు సర్టిఫికేటు జతపరచవలెను.
4. కమీషనరు గాని వారి అనుమతి పొందిన వారిచే గాని వేలంపాట నిర్వహించబడును.
5. వేలంపాట రద్దు పరుచుటకు గాని ఖాయపరుచుటకు కౌన్సిల్ వార్కి పూర్తి అధికారం కలదు.
6. తేది.31-12-2025 నాటికి రోడ్డు మార్జిన్ పాట మొత్తంను పాటదారుడు పూర్తిగా చెల్లించవలెను.
7. పాటదారుడు ముందుగా పాటపాడిన 7 రోజులు లోగా పాట మొత్తంలో 4వాయిదాలు ముందుస్తుగా చెల్లించవలెను.
8. సంతలు మరియు డైలీమార్కెట్లు క్లీనింగ్ చేయించవలెను.
9. పట్టణ ప్రాధాన కూడళ్లలో సదరు ఆశీలు రేట్లును 3/6 (సైజ్ కలది) ఫ్లెక్సిలను పాటదారులు ప్రదర్శించవలెను.

– కమీషనరు, యలమంచిలి పురపాలక సంఘం

జనసేన ఆవిర్భావ దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

- నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి



సభాస్థలి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గెడ్డం బుజ్జి, జనసైనికులు

నక్కపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి చెప్పారు. గొడిచెర్ల హైవే పక్కన వున్న స్థలంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభను నిర్వహించే స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సభకు రాష్ట్ర వ్యాప్తంగా వున్న జనసేన శాసనసభ్యులు 20 మంది వస్తారని చెప్పారు. ఆయన వెంట పార్టీ మండలశాఖ అధ్యక్షుడు వెలగా సుధాకర్, ఉపాధ్యక్షుడు నల్లల రత్నాజీ, జగ్గన్నదొర, దేవవరపు రఘు, యాగదాసు నానాజీ, పొడగట్ల వీర, పల్లి దుర్గారావు వున్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఇద్దరు బాలికలు ఎంపిక



ఆర్. మౌనిక



మళ్ల హర్షిత

కోటవురట్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములవాక, రాజుపేట పాఠశాలలకు చెందిన ఇద్దరు బాలికలు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. పాములవాక జడ్పీ హైస్కూల్‌లో ఎనిమిది తరగతి చదువుతున్న ఆర్.మౌనిక స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్టు హెచ్ఎం కేవీ లక్ష్మీనారాయణ తెలిపారు. అలాగే రాజుపేట యూపీస్కూల్ మళ్ల హర్షిత ఎంపికైనట్టు హెచ్ఎం ఆర్. మణిమోహన్ తెలిపారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాము డిమాండ్

అచ్యుతాపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. శుక్రవారం పంచాయతీ కార్మికులతో మండల కేంద్రంలో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతికేళ్లుగా కార్మికులు పనిచేస్తున్న వారికి వేతనం చాలా తక్కువగా ఇస్తున్నారన్నారు. వీరికి కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ ప్రభాకరరావుకి వినతిపత్రాన్నిచ్చారు. కార్యక్రమంలో కె.సోమునాయుడు, ఆడారి నాగేశ్వరరావు, నాగమణి, శ్రీరాములు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని గ్రామాలు

అచ్యుతాపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కొత్త లైన్లు వేస్తున్నందున మండలంలో 12 గ్రామాలకు శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె. రాజశేఖర్ తెలిపారు. వెదురువాడ, గొర్లె ధర్మవరం, లంక ధర్మవరం, మెట్ట ధర్మవరం, మోసయ్యపేట బర్మా కాలనీ, అచ్యుతాపురం ఇందిరమ్మ కాలనీ, ఆర్ఆర్ కాలనీ, వెంకటాపురం సెంటర్, మార్టూరు రోడ్, అచ్యుతాపురం సెంటర్, సాయిప్రియ లేఅవుట్‌లకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఏఎంసీ మాజీ డైరెక్టర్ నానాజీ మృతి



ఎలమంచిలి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టరు మునగపాక నానాజీ(49) శుక్రవారం ఉదయం మునిసిపాలిటీ యర్రవరంలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురవ్వడంతో విశాఖ ఆస్పత్రిలో వైద్య సేవలు పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. శుక్రవారం ఉదయం సుస్తీ చేయడంతో 108 వాహనం వచ్చే లోపే తుదిశ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయనకు జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు రాజాన నారాయణమ్మ, కౌన్సిలర్లు దూది నరసింహామూర్తి, పి.సత్తిబాబు, ఆడారి వెంకట్ నివాళులర్పించారు.

మండల పరిషత్‌ను తనిఖీ చేసిన జడ్పీ సీఈవో

నక్కపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి తనిఖీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో పలు రికార్డులు తనిఖీ చేశారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీడీవో సీతారామరాజును అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన సక్రమంగా పాటించేలా చూడాలన్నారు. శానిటేషన్ పనులను ఎప్పటికప్పుడు చేపట్టేలా పర్యవేక్షణ చేయాలన్నారు.

పి4 సర్వే ను విజయవంతం చేయాలి : ఎంపీడీఓ

ఎలమంచిలి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజం లక్ష్యంగా పి 4 సర్వేను విజయవంతం చేయాలని ఎంపీడీఓ కేఎస్. కొండలరావు కోరారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామ సెక్రటరీలు, సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 8 నుంచి 18వ తేదీ వరకూ అన్ని గ్రామాల్లో ఈ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. సర్వే విజయవంతానికి సూచనలు చేశారు.

ప్రకృతి వ్యవసాయ గ్రామంగా జగ్గన్నపేట ఎంపిక

అచ్యుతాపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతిలో రైతులంతా పంటల సాగు చేయాలని వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం జగ్గన్నపేటలో సేంద్రియ ఎరువుల తయారీపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. నూరు శాతం ప్రకృతి వ్యవసాయం చేసే గ్రామంగా జగ్గన్నపేటను ఎంపిక చేశామన్నారు. ఖరీఫ్ సీజన్‌కి కావలసిన విత్తనాలు, ఇన్‌పుట్స్ విత్తనాలు, కిట్లు, కషాయాల తయారీపై మండల వ్యవసాయాధికారి శంకర్ గోవింద్ రైతులకు వివరించారు. రసాయన ఎరువులు, పురుగుల మందులకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో మళ్ల కోటి పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం పోరాటం

- ఐద్వా మండల కన్వీనర్ లక్ష్మి



అచ్యుతాపురంలో ర్యాలీని నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తితో మహిళల హక్కుల కోసం పోరాడుదామని ఐద్వా మండల కన్వీనర్ ఆర్ లక్ష్మి అన్నారు. శుక్రవారం మహిళా దినోత్సవం సందర్భంగా అచ్యుతాపురంలో ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత పాలకుల మాటల్లో తప్ప చేతల్లో ఉండడం లేదన్నారు. కేవలం ఓట్ల కోసం ఎన్నికల్లో మహిళలకు ఎన్నో హామీలు ఇస్తున్నారు. గెలిచిన తర్వాత మరచిపోతున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము, సత్యవతి, కాసులమ్మ, మంగమ్మ, వెంకటలక్ష్మి, విజయ, బంగారమ్మ, కె సోమినాయుడు, గంటాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

'మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి'

అచ్యుతాపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఏపీజీవీబీ అచ్యుతాపురం శాఖ మేనేజర్ అశోక్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బ్యాంకులో కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వీవోఏలు మహిళల ఆర్థికాభివృద్ధికి సహకరిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వారికి చిరు కానుకలు అందజేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు, సీసీలు శ్రీను, రాంబాబు, రమేష్, దేముడు, సరోజిని, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మా భూమి రికార్డులు మార్చిన అధికారిపై చర్యలు తీసుకోవాలి : వృద్ధురాలు వినతి

పాయకరావుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను ధిక్కరించి మా తాలూకు భూమి రికార్డులు ఇతరుల పేరు మీద మార్చిన అధికారిపై చర్యలు తీసుకోవాలని పాయకరావుపేట మండలం పీఎల్.పురం గ్రామానికి చెందిన వృద్ధురాలు పదిలం సీతయమ్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తన పేరుమీద ఉన్న మండలంలో నామవరం రెవెన్యూలో 10.70 ఎకరాలు, పీఎల్.పురం రెవెన్యూలో 3.99 ఎకరాలపై జాయింట్ కలెక్టర్ తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ కోర్టులో కేసు ఉన్నందున అది తేలేంతవరకు వివాదాస్పద భూమిని హోల్డ్‌లో ఉంచాలని జేసీ ఆదేశాలు ఇచ్చారన్నారు. అయితే గతేడాది అప్పటి పాయకరావుపేట తహసీల్దారు కొంతమంది వ్యక్తుల ఒత్తిడిలకు తలొగ్గి తప్పుడు రికార్డులు సృష్టించిన పదిలం వెంకటేశ్వరరావు పేరున 1బి, ఎల్‌పీ జారీ చేశారని వాపోయారు. దీనిపై గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి, హోం మంత్రులకు ఫిర్యాదు చేశానన్నారు. అయినా ఇప్పటి వరకు తనకు ఎటువంటి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దారు జి.సత్యనారాయణను వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి తీసుకువస్తే.. విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

గిరిజన ఉత్పత్తులకు తగిన ప్రాధాన్యం కల్పించండి

▸▸ అసెంబ్లీలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల

కొత్తూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ఉత్పత్తులకు తగిన ప్రాధాన్యం కల్పించాలని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శుక్రవారం అసెంబ్లీలో కోరారు. పసుపు, అల్లం, చింతపండు, యాపిల్, డ్రాగన్ ఫ్రూట్ వంటి వాటికి ఆర్గానిక్ సర్టిఫికెట్ వచ్చేలా కృషి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గతంలో కాఫీ, మిరియాలు వంటి వాటికి తగిన గుర్తింపు లభించిందన్నారు. గిరిజనుల ఆదాయం పెరగాలంటే అందుకు ప్రభుత్వ సహకారం కూడా అవసరమన్నారు. అలాగే వైకుంఠ ఏకాదశి టిక్కెట్ల పంపిణీలో తొక్కిసలాట జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతిలోనే కాకుండా పలు ప్రాంతాల్లో టిక్కెట్ల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. వేంకటేశ్వరస్వామి దేవాలయాలు లేనిచోట ఆలయాలు నిర్మించాలని కోరారు. వీటిపై ఆయా శాఖల మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనం రామ నారాయణ రెడ్డి స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్య, వైద్యానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో నాలుగు వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి చొరవ తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వంలో స్కూల్ కిట్లలో రూ.300 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వెంకన్న

అనకాపల్లి టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం కోరింది. శుక్రవారం ఇక్కడ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ అధ్యక్షతన కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మాట్లాడుతూ ఉపాధి కార్మికులకు పెండింగ్ బకాయిల చెల్లింపు, సమ్మర్ అలవెన్సులు, పే స్లిప్పులు వంటివి ఇవ్వకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయ కార్మికులకు పనులు లేక, ఉపాధి పనులు సరిపడక ప్రతి రోజూ వేలాది మంది ఈ ప్రాంతం నుంచి సుదూర ప్రాంతాలకు వలస పోతున్నారని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి రూ.12వేలు కూలీ బంధు పథకం కింద నగదు ఇవ్వాలని, మూడు సెంట్ల స్థలం, ఇళ్ల నిర్మాణానికి ఆరు లక్షల రూపాయల నగదుతో పాటు ప్రతి దళిత కాలనీకి రెండె ఎకరాల శ్మశానవాటికకు స్థలం ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకు ఈ నెల 12వ తేదీన చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు కె.భవాని, నర్సింహమూర్తి, బీటీ దొర, సాంబశివరావు, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

12 వరకు 'పీఎం ఇంటర్న్‌షిప్' నమోదు గడువు

కొత్తూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకానికి ఈ నెల 12లోగా అర్హులంతా పేర్లు నమోదు చేసుకోవాలని కార్మికశాఖ జిల్లా ఇన్‌చార్జి కె.వసంతరావు శుక్రవారం తెలిపారు. మంత్రిత్వ విభాగం ప్రకారం ప్రతి ఇంటర్న్‌షిప్‌నకు నెలవారీగా రూ.ఐదు వేలు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఏడాది దాటిన తరువాత రూ.ఆరు వేలను ప్రభుత్వమే నిరుద్యోగ భృతిని చెల్లిస్తుందని వివరించారు. పథకంలో చేరాలనుకునే అభ్యర్థులు pmintenship.mca.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల పన్నెండో తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ స్కీంకు అభ్యర్థులు 21 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఇంటర్మీడియట్ ఆపై ఐటీఐ ఆపై సాంకేతిక విద్య అర్హత కలిగి ఉండాలన్నారు. ఈ స్కీం కాలవ్యవధి ఏడాది పాటు ఉంటుందని తెలియజేశారు. ఈ అవకాశాన్ని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

ఏడో రోజుకు ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు

అనకాపల్లి టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై ఆర్టీసీ ఎన్ఎంయూఏ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ఏడో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో పి.పద్మావతి, ఆర్ఎస్ఆర్ మూర్తి, ఎల్ఎన్‌రావు, సీహెచ్ఎస్ రావు కూర్చున్నారు. టిమ్ డ్రైవర్లపై వేధింపులు ఆపాలని, 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, సీఅండ్‌టీ కేసుల్లో పాయింట్ల విధానాన్ని అమలు చేయాలని, సస్పెన్షన్ చేసిన డ్రైవర్, కండక్టర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని అసోసియేషన్ జోనల్ జాయింట్ సెక్రటరీ జి.శంకరరావు, రీజనల్ సెక్రటరీ పి.సుధాకర్ కోరారు. పలువురు కార్మికులు దీక్షలకు మద్దతు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారమే సమన్వయ కమిటీ లక్ష్యం


బాధితులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారిణి లక్ష్మీసుభాషిణి

కశింకోట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మండల సమన్వయ కమిటీ పనిచేస్తుందని మండల ప్రత్యేకాధికారిణి వి.లక్ష్మీసుభాషిణి తెలిపారు. శుక్రవారం ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. భూ వివాదాలు, భూ సమస్యలు తదితర అంశాలపై పోలీసులకు అందిన ఫిర్యాదులను పరిశీలించి ఇరువర్గాలు సమన్వయంతో పరిష్కరించుకునేలా కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఇటువంటి కార్యక్రమాల నిర్వహణకు అధికారులకు బాధితులంతా సహకరించాలని కోరారు. ఎంపీడీవో వి.వి.రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి, ఎస్ఐ మనోజ్‌కుమార్, హౌసింగ్ ఏఈ వెలగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంపద కేంద్రంలో వ్యర్థాలకు నిప్పు

▸▸ ఎగసి పడిన మంటలు ▸▸ దట్టమైన పొగతో జనం ఇబ్బందులు

▸▸ వెంటనే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పరవాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో గల సంపద కేంద్రం వద్ద వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు ఇందుకు పాల్పడి ఉండవచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు. వ్యర్థాలకు నిప్పు పెట్టడం వలన పెద్ద ఎత్తున మంటలతో పాటు దట్టంగా పొగ వ్యాపించింది. దీంతో భరించలేని దుర్వాసన వెదజల్లింది. ఈ కారణంగా అటుగా రాకపోకలు సాగించే వారంతా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్ వెంటనే రాంకీ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సదరు సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి

▸▸ గంజాయి రవాణాపై నిఘా పెట్టండి ▸▸ మహిళా చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించండి ▸▸ పరవాడ స్టేషన్ సిబ్బందికి ఎస్పీ ఆదేశం


పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

పరవాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ కేసుల్లో త్వరితగతిన పురోగతి సాధించాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. శుక్రవారం ఆయన పరవాడ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల ఫైళ్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గంజాయి రవాణా నియంత్రణపై దృష్టి సారించాలన్నారు. గంజాయి వినియోగదారుల వివరాలను సేకరించడంతో పాటు అటువంటి వారిపై నిఘా పెట్టాలని డీఎస్పీ విష్ణుస్వరూప్‌కు సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో తలదూర్చే వారిపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. రౌడీషీటర్లు, చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు వారి నడవడిని కనిపెడుతుండాలన్నారు. ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శులతో కలిసి పాఠశాలలు, కళాశాలల్లో మహిళా చట్టాలు, పోక్సో యాక్ట్, గుడ్ టచ్- బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, రహదారి భద్రత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం స్టేషన్‌లోని సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను ఎస్పీ తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్ఐలు పాల్గొన్నారు.

జనరిక్ మందులను వినియోగించండి

▸▸ ప్రజలకు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ విజ్ఞప్తి


జన ఔషధి కేంద్రం షాపును సందర్శిస్తున్న ఎంపీ రమేష్, సింహాద్రి హెచ్‌వోపీ

పరవాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : జనరిక్ మందులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కోరారు. సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన దీపాంజలినగర్ టౌన్‌షిప్ కాంప్లెక్స్‌లో గల ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం (జనరిక్ మెడికల్ షాపు)ను శుక్రవారం రాత్రి ఆయన సింహాద్రి హెడ్ ఆఫ్ ది ప్రాజెక్ట్ (హెచ్‌వోపీ) సమీర్‌శర్మతో కలిసి సందర్శించారు. షాపులో ఏఏ రకాల మందులు ఉన్నాయో నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జన ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. తక్కువ ధరలకే ప్రజలకు కావాల్సిన అన్ని రకాల మందులను ఈ కేంద్రాల ద్వారా అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఎస్సీ, బీసీలకు జనరిక్ ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కేంద్రం కల్పిస్తుందని చెప్పారు. వీరికి రాయితీ కూడా అందిస్తుందని వెల్లడించారు. జనరిక్ ఔషధి కేంద్రాల్లో రెండువేల రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిలో 50 శాతం నుంచి 90 శాతం వరకు రాయితీతో మందులను విక్రయిస్తున్నారన్నారు. కాగా, సీఎం రమేష్‌ను మండలంలోని నాయుడుపాలెం పంచాయతీకి చెందిన కూటమి నాయకులు సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్, టీడీపీ జిల్లా కార్యదర్శి బండారు అప్పలనాయుడు, కూటమి నాయకులు, సింహాద్రి సంస్థ అధికారులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం త్వరలో నిర్వహించబోయే మెగా డీఎస్సీ పరీక్షకు సంబంధించి అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్టు జిల్లా వెనుకబడిన తరగతులు, సంక్షేమ సాధికారత అధికారిణి రాజేశ్వరి శుక్రవారం తెలిపారు. ఆసక్తి గల బీసీ, వెనుకబడిన కేటగిరీలకు చెందిన అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ నుంచి ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే ఇందుకు అర్హులుగా పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లాకు సంబంధించిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. పూర్తి వివరాలకు జిల్లా వెనుకబడిన తరగతులు, సంక్షేమ సాధికారత కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

ఘనంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం

అనకాపల్లి రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు జోష్ పుట్టించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు కెరీర్, ఆరోగ్యం, వ్యాయామం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. నైపుణ్యాలను పెంపొందించుకుని మంచి భవిష్యత్తును పొందాలని ఆకాంక్షించారు. వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఎన్టీఆర్ వైద్యాలయం పరిసరాలు అధ్వానం'

తుమ్మపాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయం అధ్వానంగా మారిందని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు ఆరోపించారు. శుక్రవారం ఎన్టీఆర్ వైద్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ప్రధానంగా గర్భిణుల సహాయకుల విశ్రాంతి స్థలం, పోస్టుమార్టం గది, ఆసుపత్రి పరిసర ప్రాంతాలు అధ్వానంగా ఉన్నాయని వాపోయారు. ప్రభుత్వాలు మారుతున్నా వైద్యాలయంలో మౌలిక సదుపాయాల కల్పన అంతంత మాత్రంగానే ఉన్నాయన్నారు. అలాగే, ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. ఇక్కడి సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాల్సిందిగా కోరారు.

కూటమి నేతల ఫ్లెక్సీకి పాలాభిషేకం

▸▸ హామీని నెరవేర్చారని నాయీ బ్రాహ్మణులు ఆనందం


ఫ్లెక్సీలోని నేతల పటాలకు పాలాభిషేకం చేస్తున్న సంఘం ప్రతినిధులు

తుమ్మపాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం తుమ్మపాలలో శుక్రవారం నాయీ బ్రాహ్మణుల సంఘం నాయకులు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణుల కార్పొరేషన్ డైరెక్టర్ కుళ్లేటికుర్తి అప్పలరమేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో నాయీ బ్రాహ్మణులకు కూటమి నాయకులు ఇచ్చిన హామీని అమలుపర్చడం హర్షణీయమన్నారు. నాయీ బ్రాహ్మణుల సెలూన్ షాపులకు ఉచిత కరెంట్‌కు రూ.450 కోట్లు కేటాయించడం ఆనందదాయకమన్నారు. నాయీబ్రాహ్మణుల సమస్యలను గుర్తించిన ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వానికి నాయీ బ్రాహ్మణుల మద్దతు ఎల్లవేళలా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అకస్మికంగా స్కూల్ బస్సులు తనిఖీ


స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న అధికారులు

అనకాపల్లి టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రింగురోడ్డులో శుక్రవారం సాయంత్రం రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా స్కూల్ బస్సలను అకస్మికంగా తనిఖీ చేశారు. కొన్ని బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనను గుర్తించారు. ఐదు బస్సులపై రవాణా శాఖ అధికారులు జరిమానాలు విధించారని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు. పిల్లల భద్రతను దృష్టిలో పెట్టుకొని ఇలాంటి తనిఖీలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామన్నారు. అన్ని విద్యా సంస్థల బస్సులు నిబంధనలకు అనుగుణంగా నడపాలని కోరారు. ఈ తనిఖీల్లో జిల్లా రవాణాశాఖ అధికారులు రమణ, గోపికృష్ణ, అమృతగ్రేష్మ, గీతకావ్య, ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న అతివలు

▸▸ మహిళా దినోత్సవంలో వక్తలు కితాబు


డైట్ కళాశాలలో వైభవ్ జ్యూయలరీ సీఎండీ మల్లికా మనోజ్‌ను సత్కరిస్తున్న రత్నాకర్

అనకాపల్లి టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను వైభవ్ జ్యూయలరీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గ్రంధి మల్లికా మనోజ్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మగవారికి దీటుగా మహిళలు కూడా ఉన్నత శిఖరాలను అందుకుంటున్నారన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ప్రతి ఓటమి విజయానికి శోపానం వంటిదన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లోనూ విజయాలను సొంతం చేసుకుంటున్నారని వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్ ప్రసాద్‌రెడ్డి, అకాడమిక్ కో-ఆర్డినేటర్ కృష్ణనాగు, ప్లేస్‌మెంట్ అధికారి హేమంత్‌కుమార్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు. అలాగే డాక్టర్ ఏఎస్ఎల్‌కే గోపాలమ్మ రాసిన ది ఉమెన్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.


పరవాడ టిడ్కో, గృహ సముదాయంలో ఐద్వా ఆధ్వర్యంలో సదస్సు

కలెక్టరేట్ ప్రాంగణంలో మహిళలకు క్రీడా పోటీలు

అనకాపల్లి కలెక్టరేట్, : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో ఉద్యోగులకు వివిధ పోటీలను నిర్వహించారు. డిస్క్ త్రోలో కలెక్టర్ విజయకృష్ణన్ ప్రథమ బహుమతి సాధించగా, చాందినీశ్రీనాయుడు ద్వితీయ బహుమతి పొందారు. లెమన్ స్పూన్ లో ఆర్.పార్వతి ప్రథమ, కలెక్టర్ విజయకృష్ణన్ ద్వితీయ, స్పీడ్ వాక్‌లో కలెక్టర్ విజయకృష్ణన్ ప్రథమ, కె.రమామణి ద్వితీయ స్థానాలను సాధించారు.

'మహిళా సమానత్వంతోనే సమాజాభివృద్ధి'

పరవాడ : మహిళా సమానత్వంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐద్వా ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక టిడ్కొ గృహ సముదాయాల వద్ద మహిళల హక్కులపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, మహిళా కమిటీ ప్రతినిధులు ఎం.బంగారమ్మ, డి.లక్ష్మి, టి.అన్నపూర్ణ, ఆర్.ఇందుమతి, కె.అరుణ, ఎం.సంతోషి పాల్గొన్నారు.

మహిళల హక్కులు కాపాడాలంటూ ర్యాలీ



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

అనకాపల్లి టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మహిళల హక్కులు కాపాడాలంటూ శుక్రవారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల సీఐటీయూ కార్యాలయం నుంచి నెహ్రూచౌక్ వరకు ఈ ర్యాలీ సాగింది. మహిళలను గౌరవించాలని, బాలికలను బతకనిద్దాం- ఎదగనిద్దాం అని, మహిళలపై హింసను అరికట్టాలని, స్కీమ్ వర్కర్లకు వేతనాలు పెంచాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారన్నారు. మహిళల హక్కులను అణిచివేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో మహిళలకు సమాన వేతనాలు, హక్కులు ఉన్నాయన్నారు. ప్రైవేటు రంగంలో సమాన పనికి సమాన వేతనాలు అమలు కావడం లేదని వివరించారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డీడీ వరలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ మద్యపాలసీ వల్ల విపరీతంగా మహిళలపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు రామలక్ష్మి, విజయలక్ష్మి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి, రమణమ్మ, సీఐటీయూ నాయకులు గంటా శ్రీరామ్, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమాంబ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ప్రారంభం

లంకెలపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేద పండితులు మండపారాధన, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, జలాదివాసం, హోమాన్ని నిర్వహించారు. శనివారం ప్రత్యేక పూజలు, ఆదివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వంటి కార్యక్రమాలు చేపడతామని నిర్వాహకులు తెలిపారు.

దేవతా విగ్రహాల తిరువీధి ఉత్సవం

సబ్బవరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలో పునర్నిర్మించిన రామలింగేశ్వర, ఉమాదేవి, లక్ష్మీగణపతి శిలా విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం విగ్రహాలు, పసిడి కలశాల తిరువీధి ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు దంగేటి నాగేశ్వరరావు, ప్రకాశ్, గెడ్డం కృష్ణ, బర్ల రమణ, కొల్లి కృష్ణ, గంగునాయుడు, ధనిమిరెడ్డి శ్రీను, గెడ్డం రమేశ్, అయ్యప్ప, గ్రామ పెద్దలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

పరవాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఈ.బోనంగి పంచాయతీ బొద్దపువానిపాలెంలో అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి స్వామి వారికి విశేష పూజలు జరిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, సర్పంచ్ బొద్దపు శ్రీనివాసకాసులు, జనసేన పార్టీ మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాదరావు, మాజీ సర్పంచ్‌లు బొద్దపు నూకరత్నం, అట్టా సన్యాసిఅప్పారావు, మేడిశెట్టి అప్పారావు, బుగిడి రామగోవిందరావు, మేడిశెట్టి బాలాజీనాయుడులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

11న పరదేశమ్మ అనుపోత్సవం



సబ్బవరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : తవ్వవానిపాలెం ప్రజల ఆరాధ్య దేవత పరదేశమ్మతల్లి అనుపోత్స వం ఈ నెల 11న జరగనుంది. ఇందుకు సంబంధించి గ్రామ పెద్దలు, పారిశ్రామికవేత్త బోకం శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో పదో తేదీన తొలేళ్ల ఉత్సవంతో పాటు వివిధ పోటీలు నిర్వహించనున్నామన్నారు. మర్నాడు అమ్మ వారి పండుగ జరపనున్నారు. ఆ రోజు ఘటాల ఊరే గింపు, అనుపోత్సవం, జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు వంటివి ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు అట్టలు పంపిణీ

సబ్బవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ మల్ల యోగి అట్టలను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన లక్ష్మిశెట్టి గోపీనాథ్ తన కుమారుడి జ్ఞాపకార్థం వీటిని సమకూర్చారు.

మహిళా ఉద్యోగుల పాత్ర ప్రత్యేకం

చింతపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళా ఉద్యోగుల పాత్ర కీలకమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీ గిరి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన మహిళా దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే వృత్తిలోనూ రాణిస్తున్నారన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు నిర్వహించి విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. ఎంఈవో-1, 2 పీబీవీ వీవీ.ప్రసాద్, గెమ్మెలి బోడంనాయుడు, ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షులు జి.వరలక్ష్మి, పీఆర్‌టీయూ స్టేట్ కౌన్సిల్ కె.మత్స్యలింగం, మండలాధ్యక్షుడు కె.సంజీవరావు, జిల్లా కార్యదర్శులు ఆర్.వెంకటరమణమ్మ, ఉత్తరకుమారి పాల్గొన్నారు.









ఏజెన్సీలో అందుబాటులోకి భూ రిజిస్ట్రేషన్ సేవలు

▸▸ జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్

పాడేరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూముల రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి రానున్నాయని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్ కుమార్ పేర్కొన్నారు. జిల్లాలోని ఐటీడీఏ పీవోలు, సబ్ కలెక్టర్లు, రిజిస్ట్రేషన్ శాఖాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో శుక్రవారం నిర్వహించిన సమావేశం, వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలోని గిరిజన చట్టాలను, రిజిస్ట్రేషన్ చట్టాలను పక్కాగా అమలు చేస్తూ రిజిస్ట్రేషన్ సేవలను ప్రజలకు అందించాలన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 8న రంపచోడవరం, పాడేరు కేంద్రాల్లో స్టాంప్స్ అండ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రారంభించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గతంలో తహసీల్దార్ కార్యాలయాల్లో జరిగిన భూముల రిజిస్ట్రేషన్ రికార్డులను పరిశీలించి భద్రపరచాలని ఆదేశించారు. గతంలో రిజిస్ట్రేషన్ చేసిన భూముల రికార్డులను డిజిటలైజేషన్ చేయాలని, ఈ ఏడాది మే ఒకటో తేదీ నుంచి అనుమతులు లేకుండా లేఅవుట్లు, భవన నిర్మాణాలు చేపట్టకూడదని చెప్పారు. అలాగే సంబంధిత గ్రామ పంచాయతీల నుంచి లేఅవుట్ల, భవన నిర్మాణాల ప్లానులను సైతం ఆన్‌లైన్‌లో ఆమోదం పొందాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా భూముల మార్కెట్ విలువలను రిజిస్ట్రార్ కార్యాలయానికి సంబంధించిన వెబ్‌సైట్‌లో పొందుపరిచారన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ, కట్టా సింహాచలం, అపూర్వభరత్, పాడేరు, రంపచోడవరం సబ్ కలెక్టర్లు శౌర్యమన్‌పటేల్, కేఆర్.కల్పశ్రీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ జి.బాలకృష్ణ, జిల్లా రిజిస్ట్రార్ టి.ఉపేంద్రరావు, సబ్ రిజిస్ట్రార్ కె.రమేశ్, డీపీవో బి.లవరాజు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.


రిజిస్ట్రేషన్ శాఖాధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

మహిళా దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

జిల్లా నుంచి మండల స్థాయి వరకు నిర్వహణకు సన్నాహాలు

పాడేరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గతానికి భిన్నంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రతీ జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గం, మండల స్థాయిల్లోనూ వేడుకలను నిర్వహించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి రాజధాని నుంచి అన్ని జిల్లాలకు చెందిన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. ఈ వేడుకలను ఘనంగా నిర్వహించడంతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలను సత్కరించడం, వారి విజయగాథలను ఇతరులకు తెలియపర్చడం వంటి స్ఫూర్తిమంతమైన అంశాలపై దృష్టిపెట్టాలన్నారు. దీంతో జిల్లా యంత్రాంగం శనివారం జిల్లా వ్యాప్తంగా మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ నేతృత్వంలో ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలో స్థానిక వీఆర్ ఫంక్షన్ హాలులో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నారు. అలాగే పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని ప్రతి మండల కేంద్రంలోనూ వేడుకలను నిర్వహిస్తారు.


పాడేరులో మహిళా దినోత్సవానికి సిద్ధమైన వీఆర్ ఫంక్షన్ హాలు

మినుములూరులో ప్రత్యేకంగా వేడుకలు

మండలంలో మినుములూరు పంచాయతీ కేంద్రంలో ప్రత్యేకంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 13,326 పంచాయతీల్లో 26 పంచాయతీలను ఆదర్శ మహిళా స్నేహపూర్వక పంచాయతీలుగా ప్రభుత్వ గుర్తించింది. వాటిలో మినుములూరు పంచాయతీ ఒకటి. దీంతో అక్కడ విధిగా శనివారం ప్రత్యేకంగా మహిళా దినోత్సవం నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖాధికారులు సూచించారు. ఇందుకోసం పంచాయతీ కార్యదర్శి అనుషా ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ప్రజా సంఘాల ఆమోదం లేని జేఏసీ రద్దు

▸▸ ఆదివాసీ ప్రజా సంఘాల వేదిక నాయకులు

పాడేరు రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంఘాల ఆమోదం లేకుండా రిజిస్ట్రేషన్ చేసిన జేఏసీని రద్దు చేస్తున్నామని ఆదివాసీ ప్రజా సంఘాల వేదిక నాయకులు కె.చిన్ని, కె.సుబ్రహ్మణ్యం, కె.రాధాకృష్ణ, కె.సురేంద్ర, పి.లక్కు ప్రకటించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో 1/70 చట్టాన్ని ఉల్లంఘించిన రొబ్బి శంకరరావుపై చర్య తీసుకోవాలని ఆదివాసీ ప్రజా సంఘాలతో అప్పటిలో ఏర్పడిన జేఏసీని రద్దు చేస్తున్నామన్నారు. నూతన జేఏసీ ఏర్పాటుకు ఈ నెల 12వ తేదీన పాడేరులో నిర్వహించనున్న సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఆదివాసీ ప్రజా సంఘాల త్యాగాలు ఫలితంగా ఏర్పడిన జేఏసీని కొంత మంది వ్యక్తులు వారి ప్రయోజనాల కోసం తాకట్టు పెట్టారని, ప్రజా సంఘాలతో సంప్రదించకుండా ఏకపక్షంగా జేఏసీని రిజిస్ట్రేషన్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గాయకుడు దుడ్డు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


సంఘీభావం తెలుపుతున్న ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు

పురుషులతో దీటుగా మహిళలు ముందుకు

▸▸ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్

అరకులోయ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పురుషులతో దీటుగా మహిళలు ముందుకు సాగుతున్నారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్ నాయక్ అభివర్ణించారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో పోటీ పడుతున్నారన్నారు. ప్రాంతీయ ఆస్పత్రి వైద్యురాలు పావని మాట్లాడుతూ మహిళలు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ పి.సుందరిరాణి, సభ్యులు విజయలక్ష్మి, అనితకుమారి, అంబిక, భవానీ, వైస్ ప్రిన్సిపాల్ పుష్పరాజ్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ పి.కొండబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు. అంతకు ముందు వారం రోజులుగా నిర్వహిస్తున్న పలు రకాల పోటీల విజేతలకు బహుమతులు అందించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

జి.మాడుగుల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎస్‌ఐ షణ్ముఖరావు చెప్పారు. పాలమామిడి పంచాయతీ కొక్కిరాపల్లిలో జాతర సందర్భంగా శుక్రవారం వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా తగిన చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.రామకృష్ణ, కూటమి నాయకులు జె.అంకిత్, జి.అప్పారావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సకల దేవతల ఆలయంలో ప్రత్యేక పూజలు

చింతపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సకలదేవల ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయం 16 వార్షికోత్సవం పురస్కరించుకుని భక్తులు దేవతలకు అర్చనలు, కుంకుమ పూజలు జరిపించారు. అనంతరం ప్రత్యేక హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సకలదేవల ఆలయ ధర్మకర్త గోకాడ సత్యనారాయణ, వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, నిర్వాహకులు డి.రమణ, అర్చకులు జగన్, భక్తులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు టార్పాలిన్ల పంపిణీ

జి.మాడుగుల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా రైతులు టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న బ్రాంచ్ మేనేజర్ ఎన్.కొండబాబు చెప్పారు. శుక్రవారం చిన్నబంధవీధి డీఆర్ డిపో పరిధిలో అరగడపల్లి, కోరాపల్లి, నేరేడివలస గ్రామాల కాఫీ రైతులకు టార్పలిన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఎం మాట్లాడుతూ ఈ ఏడాది వందకు పైగా కిలోలు కాఫీలు పండించిన రైతులకు ఉచితంగా టార్పాలిన్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కాఫీ రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని, వారిని ప్రోత్సహిస్తామన్నారు. సేల్స్‌మాన్ జి.నిరీక్షణరావు పాల్గొన్నారు.

పసుపు, పిప్పళ్లకు మద్దతు ధర ఇవ్వాలి

పెదబయలు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు పండిస్తున్న పసుపు, పిప్పళ్లను మద్దతు ధరకు జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలని గిరిజన సంఘం నేతలు కిల్లో సురేంద్ర, బొండా సన్నిబాబు డిమాండ్ చేశారు. వడ్డేపుట్టు గ్రామంలో రైతులతో శుక్రవారంవారు మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో కష్టానికి తగ్గ ఫలితం రావడం లేదని రైతులు వాపోయారు. గిరిజన సంఘం నేతలు కె.త్రినాథ్, రాందాసు, బి.గంగాధరం, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

శరభన్నపాలెం ఎంపీటీసీ సోమగాంధీ మృతి


సోమగాంధీ (ఫైల్)

కొయ్యూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శరభన్నపాలెం ఎంపీటీసీ సభ్యుడు లోకుల సోమగాంధీ (42) శుక్రవారం మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, విశాఖపట్నం కేజీహెచ్‌లో వైద్య సేవలు పొందుతూ మరణించారు. గాంధీ మరణవార్తతో శరభన్నపాలెంలో విషాదఛాయలు అలముకున్నాయి. మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్, ఎంపీపీ బడుగు రమేశ్‌బాబు, మాజీ ఎంపీ మాధవి, ఎంపీడీవో ప్రసాద్, వైసీపీ నేతలు జల్లి సుదాకర్, తేడబరి సురేశ్‌కుమార్, ట్రైకార్ మాజీ డైరెక్టర్ సరస్వతి, కార్యకర్తలు కుటుంబీకులను పరామర్శించారు.

పలకజీడి వారపు సంతలో షెడ్లు దగ్ధం

కొయ్యూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పలకజీడిలో వారపు సంత నిర్వహణకు వ్యాపారులు నిర్మించుకున్న 25 షెడ్లు గురువారం సాయంత్రం దగ్ధమయ్యాయి. దీంతో సుమారు 50 మంది చిరు వ్యాపారులకు నష్టం వాటిల్లింది. ఈ సంత పరిధిలోని సుమారు 25 గ్రామాల ప్రజలకు నిత్యావసర సరకుల కొనుగోలు, వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలకు ఈ సంత ఆధారంగా ఉంది. ఈ క్రమంలో షెడ్లు దగ్ధం కావడంతో సంత ఏర్పాటు ప్రశ్నార్థకమైంది. ప్రమాద విషయాన్ని సర్పంచ్ రమేశ్ రెవెన్యూతో పాటు ఇతర శాఖల అధికారులకు తెలిపారు.

పేదరికం నిర్మూలనకు పీ4 పునాది


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

చింతపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనకు పీ4 పునాది అని ఎంపీడీవో యూఎస్‌వీ.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పీ4 విధానానికి శ్రీకారం చుడుతుందన్నారు. ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు అన్ని గ్రామాల్లోనూ సర్వే నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు.

సకాలంలో ధ్రువపత్రాల జారీ: తహసీల్దార్

గూడెంకొత్తవీధి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సకాలంలో కుల, ఆదాయ ధ్రువపత్రాలు జారీచేస్తున్నట్టు తహసీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. రింతాడ గ్రామ సచివాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయకపోవడాన్ని గుర్తించి ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్జీలను వెంటనే ఆన్‌లైన్ చేయాలని, ప్రజలను తిప్పించవద్దని ఆదేశించారు. మ్యూటేషన్ దరఖాస్తు సమయంలో వ్యక్తి ఇంటి పేరు, కులం, ఉపకులం, భూమి సర్వే నంబరు, ఉప సర్వే నంబరు, భూమి విస్తీర్ణం వివరాలు తప్పిదాలు లేకుండా రికార్డు చేయాలన్నారు. విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో డీడీవో అరుణ్‌కిరణ్ పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి

చింతపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల ఆరోగ్యంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో ప్రసాద్ అన్నారు. పాఠశాలల్లో శుక్రవారం కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిశోర బాలికల రక్షణ కోసం శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో జీవీ రమణ, ఏసీడీపీవో రామలక్ష్మి, ఎంఈవో-2 గెమ్మెలి బోడం నాయుడు పాల్గొన్నారు.


మోదకొండమ్మ సన్నిధిలో కేంద్ర కాఫీ బోర్డు చైర్మన్ దినేశ్, తదితరులు

మోదకొండమ్మను దర్శించుకున్న కాఫీ బోర్డు చైర్మన్

▸▸ మన్యంలో కాఫీ బోర్డు సేవలపై ఆరా

పాడేరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కాఫీ బోర్డు చైర్మన్ ఎంజే.దినేశ్ శుక్రవారం మోదకొండమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటినాయుడు, కాఫీ బోర్డు సభ్యులు కురసా ఉమామహేశ్వరరావు, జైతి ప్రభాకర్ తదితరులు చైర్మన్ ఎంజే.దినేశ్, తదితరులను ఘనంగా సత్కరించారు. అనంతరం కాఫీ బోర్డు ఆధ్వర్యంలో గిరిజనులకు కల్పిస్తున్న రాయితీలు, సేవలపై ఐటీడీఏ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఆరా తీశారు. కాఫీ బోర్డు సేవలను మరింత విస్తరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాఫీ బోర్డు ఎస్‌ఎల్‌వో రమేశ్, అధికారులు, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఏల పదోన్నతులకు 10న సర్టిఫికెట్ల పరిశీలన

పాడేరు రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖలో స్కూల్ అసిస్టెంట్‌లకు పదోన్నతలు కల్పించేందుకు ఈ నెల 10వ తేదీన సర్టిఫికెట్‌ల పరిశీలన చేపడుతున్నామని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎల్.రజని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాతోపాటు, ప్రస్తుత అల్లూరి సీతారామరాజు జిల్లాలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టులను అర్హతగల సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతలు కల్పించేందుకు సర్టిఫికెట్‌లు పరిశీలన చేస్తామన్నారు. సంబంధిత స్కూల్ అసిస్టెంట్ సబ్జెక్టులో ఉత్తీర్ణులైన సెకండరీ గ్రేడ్ టీచర్లు తమ ఒరిజనల్ సర్టిఫికెట్‌లతో ఐటీడీఏలోని గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకుల కార్యాలయంలో ఈ నెల 10వ తేదీ ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని ఆమె తెలిపారు.

మరుగుదొడ్లను వినియోగించుకోండి: కలెక్టర్

పాడేరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మరుగుదొడ్లను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ సూచించారు. స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో విజువిస్ సంస్థ, మంత్రి సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ సామాజిక బాధ్యతలో భాగంగా నిర్మించిన మరుగుదొడ్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా ఆయా సంస్థలు ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ గణేశ్, పాఠశాల హెచ్‌ఎం ధనలక్ష్మి, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు శిక్షణ తరగతులు

పాడేరు రూరల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ప్రాథమిక కుట్టు శిక్షణ తరగతులను శనివారం ప్రారంభిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ తెలిపారు. జిల్లాలోని వివిధ కార్పొరేషన్ల ద్వారా 862 మంది మహిళలకు ఈ శిక్షణ అందిస్తామన్నారు. 18 నుంచి 50 ఏళ్ల లోపు స్థానిక మహిళలు ఇందుకు అర్హులని, తెల్ల రేషన్, ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. శిక్షణ వ్యవధి 45, 60, 90 రోజులు వరకు ఉంటుందన్నారు. శిక్షణ పూర్తయిన తరువాత అభ్యర్థికి ఒక మోడల్ కుట్టు మిషన్ ఉచితంగా అందిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వారం రోజుల్లోగా ఎంపీడీవో కార్యాలయం లేదా గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉపాధి శిక్షణ దరఖాస్తులకు నేడు తుది గడువు

పాడేరు రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజన యువతకు విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సహకారంతో సీఈఎంఎస్ ఆధ్వర్యంలో ఉచిత స్వయం ఉపాధి శిక్షణ కోసం శనివారంలోగా దరఖాస్తు చేసుకోవాలని సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమాండర్ శివం గోపీ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 27 ఏళ్ల లోపు పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, డిప్లొమో ఇన్ మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 7794840934, 8688411100, 8331901237, 0891-2704010 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ద్వితీయ ఇంటర్ పరీక్షకు 97 శాతం హాజరు

పాడేరురూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం జరిగిన ద్వితీయ ఇంటర్ పరీక్షలకు 97 శాతం మంది హాజరయ్యారని డీఐఈవో ఎల్.అప్పలరామ్ తెలిపారు. శుక్రవారం జరిగిన మేథ్స్, బోటనీ, సివిక్స్ పరీక్షకు జిల్లాలోని 26 పరీక్ష కేంద్రాల నుంచి జనరల్ గ్రూపు విద్యార్థులు 5,495 మంది హాజరు కావాల్సి ఉండగా 5,349 (97.34 శాతం) వచ్చారన్నారు. అలాగే జిల్లాలోని ఎనిమిది పరీక్షా కేంద్రాలలో నిర్వహించిన ఒకేషనల్ గ్రూపు పరీక్షలకు 1,228 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1,150 (93 శాతం) మంది వచ్చినట్టు చెప్పారు.

ఆదివాసీలకు అండగా పోలీస్ శాఖ: సీఐ

ముంచంగిపుట్టు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు అండగా పోలీసు శాఖ ఉంటుందని జి.మాడుగుల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసు అన్నారు. మండలంలోని మారుమూల లక్ష్మీపురం పంచాయతీలో శుక్రవారం పరివర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష్మీపురం, బుంగాపుట్టు, బరడ పంచాయతీల గిరిజనులతో సీఐ మమేకమయ్యారు. లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని పీహెచ్‌సీగా మార్చాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని, బుంగాపుట్టుకు ఆర్టీసీ బస్సు నడపాలని ఆయా ప్రాంతీయులు విన్నవించారు. దీనికి సీఐ స్పందిస్తూ బస్సు సర్వీసు నడిచేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన దృష్టికి వచ్చిన ఇతర సమస్యలు సైతం పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ప్రజలు గంజాయి, నాటుసారాకు దూరంగా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సూర్యనారాయణ, ఏఎస్‌ఐ పి.తిరుపతి, సర్పంచ్ కె.త్రినాథ్ పాల్గొన్నారు.

బ్యాంకు అధికారులపై విచారణ చేపట్టాలి

డుంబ్రిగుడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రుణాలు చెల్లించలేదంటున్న బ్యాంకు అధికారులపై విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కించుమండ దుర్గమ్మ డ్వాక్రా సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు బ్యాంకు ఆవరణలో శుక్రవారం నిరసన తెలిపారు. రుణాలు చెల్లించినప్పటికీ బకాయి ఉందని అధికారులు బ్యాంకు చుట్టూ తిప్పించుకుంటున్నారని సంఘం అధ్యక్షురాలు, అమ్మి, కార్యదర్శి సీతమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో బ్యాంకు అధికారులపై విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని వారు వేడుకున్నారు.

ధారకొండలో 270 మందికి కంటి పరీక్షలు

సీలేరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ధారకొండ పంచాయతీ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరంలో 270 మందికి కంటి పరీక్షలు చేసినట్టు వైద్యాధికారి డీకే హిమబిందు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణులు కంటి పరీక్షలు చేశారని, డాక్టర్ మస్తాన్‌వల్లితో కలిసి తాము సాధారణ ఆరోగ్య తనిఖీలు నిర్వహించామని చెప్పారు. వారిలో 32 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో సీఐ వరప్రసాద్, ఎస్‌ఐ రవీంద్ర, శంకర్ ఫౌండేషన్ అప్తాలమిక్ కె.రమేశ్‌బాబు, సర్పంచ్ ఎన్.రాజు, ఎంపీటీసీ రామన్న పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలకు బియ్యం సరఫరా

పెదబయలు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు శుక్రవారం బియ్యం పంపిణీ చేశారు. 'ఆశ్రమ పాఠశాలల్లో అడుగంటిన బియ్యం' అనే శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి జీసీసీ అధికారులు స్పందించారు. ఈ మేరకు పెదబయలు బాలుర పాఠశాల-1, 2, బాలికల పాఠశాల-1, 2, సీకరి, అరడకోట పాఠశాలలకు బియ్యం సరఫరా చేసినట్టు జీసీసీ గోదాము ఇన్‌చార్జి ఎస్.ధీనకుమారి తెలిపారు. మిగిలిన పాఠశాలలకు కూడా శని, ఆదివారాలు పంపిణీ చేస్తామని చెప్పారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

పాడేరు రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కాడెలి పంచాయతీ వర్తనాపల్లి గ్రామంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా శక్తి అన్ని రంగాల్లోనూ సత్తా చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సెంట్రల్ కమిటీ సభ్యులు బొర్రా నాగరాజు, టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీపీ బొర్రా విజయరాణి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు ఎస్.మత్స్యకొండమ్మ, సొసైటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో మహిళల విజయం

▸ మహిళా దినోత్సవంలో స్పీకర్ అయ్యన్న సతీమణి పద్మావతి



పద్మావతికి జ్ఞాపిక అందిస్తున్న గైనకాలజిస్ట్ డాక్టర్‌వందన

నర్సీపట్నం అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు సతీమణి, మునిసిపల్ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. విద్య, ఉద్యోగాలు, వ్యాపారం, రాజకీయాల్లో తమదైన ముద్రను వేసుకుంటున్నట్టు చెప్పారు. కృషి, పట్టుదలతో ముందుకు వెళితే లక్ష్యాన్ని సాధించవచ్చునని వివరించారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం సీఐ ఎల్.రేవతమ్మ, గైనకాలజిస్ట్ డాక్టర్ పి.వందన, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'సంపద కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలి'



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

మాకవరపాలెం, మార్చి7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంపద కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి సచివాలయం సిబ్బందికి సూచించారు. పైడిపాలలో సంపద కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాల్సిందిగా సూచించారు. అలాగే గ్రామాల్లో పీ-4 సర్వే పూర్తి చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు.

ఉపాధి కూలీలకు వంద రోజులు పని

▸ విధిగా కల్పించాల్సిందే ▸ డ్వామా పీడీ పూర్ణిమాదేవి ఆదేశం ▸ గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై సమీక్ష



ప్రజా వేదికలో పాల్గొన్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి, ఇతర అధికారులు

నర్సీపట్నం అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం కూలీ లకు ఏడాదిలో వంద రోజులు పనిని విధిగా కల్పించాల్సిందేనని డ్వామా పీడీ పూర్ణిమాదేవి స్పష్టం చేశారు. ఇక్కడి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శుక్రవారం ప్రజా వేదికను నిర్వహించారు. ఏప్రిల్ ఒకటి 2023 నుంచి మార్చి 31, 2024 వరకు చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి రూ.12 కోట్ల అభివృద్ధి పనులపై సమీక్ష జరిపారు. క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీలు నిర్వహించిన బృందం పనుల్లో గుర్తించిన లోపాలను సభ ముందు ఉంచారు. పలు చోట్ల కూలీలు పనికి వెళ్లకపోవడం, తప్పుడు మస్తర్లు రికార్డుల్లో నమోదు చేయడం తదితాలను వివరించారు. సోషల్ ఆడిట్ బృందం తనిఖీకి వెళ్లినప్పుడు గబ్బాడ ఫీల్డ్ అసిస్టెంట్ నిత్యం మద్యం మత్తులో ఉంటూ తన విధులను సక్రమంగా నిర్వహించడం లేదంటూ ఆడిట్ సభ్యులతో పాటు వేదికపై ఉన్న ప్రజాప్రతినిధులు పీడీ దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను పీడీ ఆదేశించారు. కాగా, ఈ పనుల్లో సుమారు లక్ష రూపాయల మేరకు నిధులు దుర్వినియోగం జరిగినట్టు గుర్తించారు. సంబంధిత వ్యక్తుల నుంచి రికవరీ చేయాలని పీడీ సూచించారు. ఈ సమావేశంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, వేములపూడి ఎంపీటీసీ బోళెం రామ్ ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు లాలం శ్రీరంగస్వామి, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ నిర్మలాదేవి, ఎస్ఆర్‌పీ నాగరాజు, ఎంపీడీవో ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో నిమ్మకట్టు చానల్ పనులు

▸ సిబ్బందిని ఆదేశించిన తాండవ ప్రాజెక్టు డీఈఈ అనురాధ

▸ త్వరలో కుడి, ఎడమ కాలువల్లో పూడిక తీస్తామని వెల్లడి



లైనింగ్ పనులను పరిశీలిస్తున్న డీఈ అనురాధ, తదితరులు

నాతవరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నిమ్మకట్టు చానల్ సిమెంట్ లైనింగ్ పనులు పక్కా నాణ్యతతో చేపట్టాలని, పనులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని తాండవ ప్రాజెక్టు డీఈఈ అనురాధ ఆదేశించారు. స్థానిక నీటి సంఘం అధ్యక్షుడు అపన దివాణంతో కలిసి నిమ్మకట్టు చానల్‌లో జరుగుతున్న లైనింగ్ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిమ్మకట్టు చానల్ దగ్గర సిమెంట్ లైనింగ్ రక్షణగోడకు రూ.12 లక్షలు, జిల్లేడిపూడి వద్ద కాలువల అభివృద్ధికి మరో రూ.12 లక్షలు మంజూరు కావడంతో చురుగ్గా పనులు జరుతున్నట్టు చెప్పారు. త్వరలో తాండవ కుడి, ఎడమ కాలువల్లో పూడికతీత పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. అలాగే, తాండవ మెయిన్ గేట్ల లీకేజీలను అరికట్టేందుకు కూడా మరమ్మతు పనులు చేపట్టనున్నట్టు వివరించారు. పనుల్లో పొరపాట్లు జరగకుండా చూడాలని ఏఈ శ్యామ్, వర్కు ఇన్‌స్పెక్టర్ అప్పారావులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ విభాగం జేఈ స్నేహ, టీసీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రైనేజీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



గుర్తు తెలియని మృతదేహం

చోడవరం, మార్చి7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని మురుగునీటి కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కాంప్లెక్స్ ఔట్ గేటు వద్ద గల కాలువలో వ్యక్తి చనిపోయి ఉండడం గమనించిన కొందరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మృతుడిని పోలీసులు కాలువ నుంచి బయటకు తీశారు. మృతుడు నల్ల రంగు ప్యాంటు, నిలువుగీతల షర్ట్ ధరించి ఉన్నాడు. వయస్సు సుమారుగా 50 సంవత్సరాలు ఉంటుందని అంచనా. ఈ వ్యక్తికి సంబంధించిన సమాచారం తెలిసిన వ్యక్తులు స్థానిక సీఐ 9440796090, లేదా ఎస్ఐలు 9492952555, 8142936937లకు ఫోన్ చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

'గ్రామాల్లో సారా నిర్మూలన అందరి బాధ్యత'

కృష్ణాదేవిపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నాటుసారా నిర్మూలకు ప్రజలంతా సహకరించాలని గొలుగొండ ఎక్సైజ్ సీఐ వి.రామకృష్ణ కోరారు. శుక్రవారం సాయంత్రం ఏఎల్‌పురం రామాలయం వద్ద నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుందన్నారు. సారా తాగడం వల్ల ఆరోగ్యానికి హానికరమన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ ఎస్‌కె రహీమ్, మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, సర్పంచ్ లోచల సుజాత, ఎంపీ టీసీ రుత్తల రామకృష్ణ, టీడీపీ నాయకులు బొడ్డు జమీలు పాల్గొన్నారు.

12 వరకు 'పీఎం ఇంటర్నషిప్' నమోదు గడువు

అనకాపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఇంటర్నషిప్ పథకానికి ఈ నెల 12లోగా పేర్లు నమోదు చేసుకోవాలని కార్మికశాఖ జిల్లా ఇన్‌చార్జి కె.వసంతరావు శుక్రవారం తెలిపారు. మంత్రిత్వ విభాగం ప్రకారం ప్రతి ఇంటర్నషిప్‌నకు నెలవారీగా రూ.ఐదు వేలు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఏడాది దాటిన తరువాత రూ.ఆరు వేలను ప్రభుత్వమే నిరుద్యోగ భృతిని చెల్లిస్తుందని వివరించారు. పథకంలో చేరాలనుకునే అభ్యర్థులు pmintenship.mca.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల పన్నెండో తేదీ లోగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ స్కీంకు అభ్యర్థులు 21 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఇంటర్మీడియట్ ఆపై ఐటీఐ ఆపై సాంకేతిక విద్య అర్హత కలిగి ఉండాలన్నారు. ఈ స్కీం కాలవ్య వధి ఏడాది పాటు ఉంటుందని తెలియజేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షియాజ్‌ఖాన్

కృష్ణాదేవిపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్‌ఖాన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గొలుగొండ మండలం ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పలు పాఠశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోక్సో చట్టం బాలికలకు రక్షణ కవచం వంటిదన్నారు. ఈ చట్టం ఏవిధంగా వర్తిస్తుందో వివరించారు. అలాగే బాల్య వివాహాల చేసుకుంటే వాటి వల్ల అనర్థాలు, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్ ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, పాల్పడితే పడే శిక్షలు తదితరాలను వివరించారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యాసరచన, ఇతర పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరరావు, నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, కృష్ణాదేవిపేట ఎస్ఐ. వై.తారకేశ్వరరావు, గొలుగొండ సీడీపీవో శ్రీగౌరీ, గొలుగొండ ఎంఈవో-2 మూర్తి, సూపర్‌వైజర్ సత్యశ్రీ, హెచ్‌ఎం నాగభూషణం, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రాజులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఖండివరం హైస్కూల్ హెచ్‌ఎం విధులకు డుమ్మా

▸ గత నెల 20వ తేదీ నుంచి గైర్హాజరు

▸ సెలవు కోసం దరఖాస్తు చేయలేదని డిప్యూటీ డీఈవో వెల్లడి

చీడికాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖండివరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు చిరంజీవి ఆచారి గత 17 రోజులుగా విధులకు గైర్హాజరవుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కొంతమంది మీడియా ప్రతినిధులు శుక్రవారం పాఠశాలకు వెళ్లారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం సునీతను ఆరాతీయగా, ఫిబ్రవరి 20వ తేది నుంచి మార్చి 5వ తేదీ వరకు హెచ్‌ఎం చిరంజీవి ఆచారి సెలవుపెట్టారని చెప్పారు. ఈ విషయమై డిప్యూటీ డీఈవోకు 'ఆంధ్రజ్యోతి' ఫోన్ చేసి వివరణ కోరగా.. ఖండివరం హైస్కూల్ హెచ్‌ఎం నుంచి తనకు ఎటువంటి సెలవు దరఖాస్తు అందలేదని, తాను సెలవు ఇవ్వలేదని తెలిపారు. దీనిపై విచారణ చేస్తామని ఆయన పేర్కొన్నారు.



పీ-4 సర్వేకు సహకరించండి: ఎంపీడీవో

రోలుగుంట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 సర్వేకు అందరూ సహకరించాలని ఎంపీడీవో నాగేశ్వరరావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తారన్నారు. ఈ సర్వే ద్వారా ధనవంతులు, పేదలను గుర్తించడంతో పాటు నిజమైన పేదలకు ప్రభుత్వం పథకాలు అందేలా చూడడమే ఈ సర్వే ఉద్దేశమని చెప్పారు. ఈ సర్వే వల్ల ప్రస్తుత పథకాలపై ఎటువంటి ప్రభావం ఉండదన్నారు.

విద్యుత్ స్తంభానికి కాంక్రీట్ పనులు

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



స్తంభం చుట్టూ కాంక్రీట్ వేస్తున్న దృశ్యం

మాడుగుల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభానికి ఆ శాఖ అధికారులు శుక్రవారం మరమ్మతు పనులు చేపట్టారు. 'ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. మాడుగుల జగ్గన్న చావడికి వెళ్లే రహదారిలో పాఠశాల ఎదురుగా ఉన్న ఈ స్తంభం అడుగు భాగం జంగుపట్టి ఏర్పడిన రంధ్రం చుట్టూ కాంక్రీట్ వేశారు. దీంతో అక్కడ ప్రజలు ఊపిరిపీల్చుకొని ఆనందం వ్యక్తం చేశారు.

చెరకు ఎండిపోతుందని రైతుల ధర్నా




అప్పలరాజుపురం కాటా వద్ద ధర్నా చేస్తున్న రైతులు

చీడికాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అప్పలరాజుపురం చెరకు కాటా వద్ద వారం రోజులుగా చెరకు ఎండిపోతున్నదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సుమారు 500 కిలోల వరకు బరువు తగ్గిందని శుక్రవారం అప్పలరాజుపురం కాటా వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోవాడ షుగర్స్ సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, వైసీపీ మండల అధ్యక్షుడు జి.రాజబాబు, సర్పంచులు చుక్క అప్పలనాయుడు, వంటాకు నరసింహమూర్తి మాట్లాడుతూ యాజమాన్యం నిర్లక్ష్యధోరణి కారణంగా టన్నుకు ప్రతీ రోజు 60 కిలోల చొప్పున బరువు తగ్గిపోతున్నదన్నారు. ఎనిమిది రోజులకు 500 కిలోల బరువు తగ్గిపోయిందని వారు వాపోయారు. అధికారులు వెంటనే చెరకు తరలించి రైతులను ఆదుకోవాలని కోరారు. ధర్నాలో రైతులు పాల్గొన్నారు.

'రోడ్డుపై రోడ్డు కోసం నిధులు మంజూరు చేశారా?'

చీడికాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బీటీ రోడ్డుపై మళ్లీ తారు రోడ్డు వేయడానికి నిధులు మంజూరు చేయించారా? అని వైసీపీ మండల అధ్యక్షుడు జి.రాజబాబు, సర్పంచులు వి.నరసింహమూర్తి, చుక్కా అప్పలనాయుడు ప్రశ్నించారు. రూ.7.65 కోట్లతో అభివృద్ధి పనులు మంజూరయ్యాయని పత్రికల్లో వచ్చిన కథనాలపై వారు మాట్లాడారు. మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు 2024లో రోడ్డు నిర్మించారని, మళ్లీ ఎమ్మెల్యే బండారు నిధులు మంజూరు చేశారని పత్రిక ప్రకటనలు ఇవ్వడం సరికాదని వారు పేర్కొన్నారు.



కొండ శిఖర గ్రామాల్లో సదుపాయాలు కల్పించాలి

▸ ఆదివాసీ మహిళల విన్నూతన నిరసన



అడ్డాకులు నెత్తిన పెట్టుకుని ర్యాలీ చేస్తున్న ఆదివాసీ మహిళలు

రావికమతం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రావికమతం-వి.మాడుగుల సరిహద్దులోని కొండ శిఖర గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని గిరిజన మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జీలుగులోవ, పశువులబంద, సోంపురంబంద గ్రామాల ఆదివాసీ మహిళలు విన్నూత్నంగా నిరసన తెలిపారు. జీలుగులోవ నుంచి చీమలపాడు పంచాయతీ శివారు బంగారు బంద వరకూ అడ్డాకులు నెత్తిన ధరించి నాలుగు కిలోమీటర్ల మేర నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గిరిజన సంఘ మహిళా నేత కిల్లో సీతమ్మ మాట్లాడుతూ సామాలమ్మ కొండపైన గ్రామాల్లో రహదారి, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే డోలీ మోతలే శరణ్యమని వాపోయారు. ఈ క్రమంలో సకాలంలో వైద్య సేవలు అందక ఎంతో మంది మృతి చెందిన సంఘటనలు ఉన్నాయని చెప్పారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉపాధి పనులు కూడా దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా దినోత్సవం పురస్కరించుకుని గిరిజన మహిళల కష్టాలను తెలియజేయాలనే ఈ నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, ఆదివాసీ మహిళలు సీదరి చిలకమ్మ, సీదరి కమల, కామేశ్వరావు, కొర్ర మహేశ్ పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభకు తరలిరండి



చోడవరం, మార్చి7 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈ నెల 14న నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభకు తరలిరావాలని నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి, పిఠాపురం సభ సమన్వయకర్త పీవీ ఎస్ఎన్ రాజు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో జన సైనికులు, వీరమహిళలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు చినపాచిల విద్యార్థి

రావికమతం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినపాచిల జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థి కరెడ్ల పాప 2024-25 విద్యా సంవత్సరంలో ఇన్‌స్పైర్ మనక్ అవార్డుకు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎస్ఎస్.ప్రసన్నకళ శుక్రవారం తెలిపారు. ఆడియో ట్రాన్స్ మిషన్ యూజింగ్ ఎల్1-ఎఫ్ ప్రాజెక్టు తయారు చేయడానికి పదో తరగతి చదువుతున్న పాప ఎంపికైందన్నారు. గైడ్‌లు సిహెచ్‌వి.భాస్కరావు, ఏఎల్ పద్మజ, విద్యార్థి పాపను పెరెంట్ కమిటీ చైర్మన్ ముచ్చర్ల ధనుంజయ, ఉపాధ్యాయులు అభినందించారు.

చోరీ కేసులో బాలుడికి రిమాండ్

చోడవరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్ చోరీ చేసిన కేసులో మైనర్ బాలుడిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు. రెండు కేసులలో దొంగతనానికి గురైన రెండు బైకులను స్వాధీనం చేసుకున్నామని, మైనర్‌ను జువైనల్ హోంకు తరలించినట్టు పోలీసులు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంతో మంచి దిగుబడులు

రావికమతం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన పంట దిగుబడులు వస్తాయని వ్యవసాయాధికారి డి.రూప చెప్పారు. మండలంలోని జెడ్.కొత్తపట్నం గ్రామంలో రైతులతో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఈ గ్రామాన్ని నూరుశాతం ప్రకృతి సాగును ఎంపిక చేశామన్నారు. రైతులు రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు పూర్తిగా వినియోగించరాదన్నారు. ఖరీఫ్ సాగులో ప్రకృతి సహజసిద్ధంగా లభ్యమయ్యే వనరులతో తయారు చేసిన ఎరువునే వినియోగించాలని సూచించారు. ప్రకృతి సాగు వల్ల భూసారం కాపాడుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విళంశెట్టి లక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు గాలి రమణబాబు, రైతులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలి

రావికమతం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయాలని కొత్తకోట పశువైద్యాధికారి జి.బాలతేజ సూచించారు. మండలంలోని కొట్నాబిల్లి గ్రామంలో శుక్రవారం ఉచితంగా టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి వస్తే పాల దిగుబడి తగ్గిపోవడం, పెయ్యిల్లో ఆకస్మిక మరణాలు సంభవస్తాయన్నారు. మండలంలో 11 వేల పశువులకు ఉచితంగా టీకాలు వేస్తున్నామని, రైతులు వినియోగించుకోవాలని కోరారు. పశు వైద్య, వ్యవసాయ సిబ్బంది గుణవతి, ప్రసాద్, జనార్ధన్, వాసు, రిషి, దేముడు, రాము తదితరులు పాల్గొన్నారు.

ఉదయం 11 గంటలకే పనులు ముగించాలి

చీడికాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎండలు దృష్ట్యా ఉదయం 11 గంట లకే పనులు ముగిం చాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ బి.శ్రీనివాసరావు సూచిం చారు. మంచాల గ్రామంలో జరుగుతున్న పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎక్కువ మంది వేతనదారులు పనులకు వచ్చేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మోహన్, డీఆర్పీ సుజాత, మేట్లు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మాడుగుల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు హాజరై అన్ని శాఖలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను సత్కరించారు. అనంతరం మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డి.సూర్యారావు, టీడీపీ. జనసేన నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ పంపిణీ

దేవరాపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదనందిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రజాస్వామ్య పర్యవేక్షణ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు జె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్షల మెటీరియల్‌ను అందజేశారు. ప్రతీ ఒక్క విద్యార్థి ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఈ సందర్భంగా ముఖ్య అతిథి కేవీ.రమణ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు సంతోశ్ పాల్గొన్నారు.

టీబీ రహిత గ్రామంగా ఆర్.భీమవరం ఎంపిక

బుచ్చెయ్యపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): టీబీ రహిత గ్రామంగా ఆర్.భీమవరం ఎంపికైనట్టు జిల్లా క్షయ నివారణ అధికారి ఎస్‌వీకే.బాలాజీ తెలిపారు. తురకలపూడి పీహెచ్‌సీని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ నెల 24న టీబీ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ అవార్డు అందిస్తారని చెప్పారు. జిల్లా కోఆర్డినేటర్ అయ్యపురెడ్డి పెంటయ్య, వైద్యులు సంధ్యరాణి, సునీల్‌మాదవ్, రామలక్ష్మి, వైద్య సిబ్బంది చంద్రమౌళి, సీతమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మరో మూడు మద్యం దుకాణాలు మంజూరు

మాడుగుల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మాడుగుల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మండలాల్లో మరో మూడు మద్యం దుకాణాలు మంజూరయ్యాయని సీఐ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. గీత కార్మికుల కోటలో మాడుగుల, చీడికాడ, రావికమతం మండలానికొ ఒక్కొక్కటి చొప్పున మంజూరైనట్టు చెప్పారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాతృ వందనం

చోడవరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మాతృ వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ మహిళా సాధికారత గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ విముక్తి సంఘటన్ కన్వీనర్ లక్ష్మీకుమారి, ఉమన్ ఎంపవర్‌మెంట్ కమిటీ కోఆర్డినేటర్ లక్ష్మీ మంగమ్మ, ఎన్ఎస్ఎస్ పీవో మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

మంటలను అదుపు చేసిన పంచాయతీ అధికారులు

చోడవరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ద్వారకానగర్ సమీపంలోని శ్మశానవాటిక డంపింగ్ యార్డులో చెత్తకు గురువారం రాత్రి మంటలు అంటుకున్నాయి. విరామం లేకుండా కాలుతుండడంతో డంపింగ్ యార్డులోని పొగ ద్వారకానగర్, బాలాజీనగర్, దుర్గాకాలనీ వాసులకు ఇబ్బందికరంగా మారింది. స్థానికుడు హరనాథ్ మెహర్ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో శుక్రవారం మంటలను అదుపు చేశారు.







నారీమణులు.. మీకు జోహార్లు



హిమాలయ పర్వతాలపైకి ట్రెక్కింగ్ చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి

యోగాలో వ్యక్తిగత శిక్షణ అందిస్తున్న రమాదేవి



ఆధునిక యుగంలో రాణిస్తున్న మహిళలు

- అన్ని రంగాల్లో అద్భుతాలు
- కుటుంబ ఆర్థిక వ్యవస్థలో కీలకం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఆధునిక యుగంలో అతివలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. చంద్ర మండలంపైకి వెళ్లడమే కాదు కుటుంబ ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్నారు. వ్యవసాయ, ఉద్యోగం, హస్తకళలు, యోగా, సాఫ్ట్‌వేర్, రైలు, విమానాలు నడపడం, చివరకు ఆర్మీలో కూడా మహిళల పాత్ర కీలకంగా మారింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారి ప్రత్యేకతను చాటిచెప్పే ప్రయత్నమే ఈ కథనాలు..

ఆల్‌రౌండర్ గీతాంజలి



క్రీడలు.. ఉద్యోగాల్లో మేటిగా..
పర్వతారోహకురాలిగా..
సేవా కార్యకర్తగా రాణింపు
స్ఫూర్తిదాత చోడవరం సబ్ రిజిస్ట్రార్ బలగ గీతాలక్ష్మి

చోడవరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):

ఎంచుకున్న రంగమేదైనా అందులో ఇమిడిపోవడమే కాకుండా ఆ రంగంలో తనదైన ముద్ర వేస్తూ పది మందికి సాయంగా నిలుస్తూ మహిళా లోకానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు మహిళా అధికారి బలగ గీతాలక్ష్మి. మహిళలంటే కేవలం వంటిల్లుకే పరిమితమని భావించే వారికి ఓ గ్రామీణప్రాంతం నుంచి వచ్చిన ఓ యువతి జాతీయ స్థాయిలో క్రీడాకారిణిగా, ఉపాధ్యాయినిగా, అధికారిగా, పర్వతారోహకురాలిగా, సామాజిక సేవా కార్యకర్తగా బహుళ పాత్రలు పోషిస్తూ మహిళలకు స్ఫూర్తిదాతగా నిలిచారు.

చోడవరం సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న గీతాలక్ష్మి అటు క్రీడల్లోనూ, పర్వతాహరోహణలోనూ, ఉద్యోగ బాధ్యతలతో పాటు సేవా కార్యక్రమాల్లో, మోటివేటర్‌గా విభిన్న పాత్రల్లో రాణిస్తూ మహిళలకు రోల్ మోడల్‌గా నిలుస్తున్నారు. విజయనగరం జిల్లా గరివిడి మండలం అర్తమూరు గ్రామానికి చెందిన గీతాలక్ష్మి తండ్రి స్వామినాయుడు హిందీ పండిట్, తల్లి అనసూయ గృహిణి. చిన్నతనం నుంచి గీతాలక్ష్మి చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ వచ్చారు. భర్త చంద్రరావు సాఫ్ట్‌వేర్ ఇంజినీరు. పదో తరగతి చదువుతున్న కుమార్తె, 6వ తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారు. 2000 సంవత్సరం డీఎస్సీలో ఉపాధ్యాయురాలిగా ఎంపికైన గీతాలక్ష్మి 2009 వరకూ పనిచేశారు. తరువాత 2009లో గ్రూప్ టూ పరీక్ష పాసై సబ్‌రిజిస్ట్రార్‌గా ఉద్యోగంలో చేరారు.

చిన్నతనం నుంచి క్రీడల్లో మేటి

తండ్రి ప్రోత్సాహంతో క్రీడలపై ఆసక్తి పెంచుకున్న గీతాలక్ష్మి చక్కని ఖోఖో ప్లేయర్. అలాగే వంద మీటర్ల రన్నింగ్‌లో జాతీయ స్థాయి పోటీల్లో కూడా పాల్గొనడం విశేషం. ఉద్యోగంలో చేరిన తరువాత కొంతకాలం విరామం ఇచ్చినప్పటికీ, మూడేళ్ల నుంచి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు. గత ఏడాది విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు పతకాలు సాధించారు.

హిమాలయాల అధిరోహణ..

క్రీడల్లో ప్రవేశం ఉన్న గీతాలక్ష్మి పర్వతారోహణ చేయాలన్న పట్టుదలతో తొలుత తూర్పుకనుమల్లోని పెద్దదైన 5,540 అడుగుల ఎత్తైన జిందఘడ శిఖరాన్ని అధిరోహించారు. ఆ తరువాత గత ఏడాది అక్టోబరులో హిమాలయాల్లో 12,110 అడుగుల ఎత్తైన చంద్రశిల శిఖరాన్ని అధిరోహించారు.

సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ..

ఇక ఉద్యోగ, కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే మరోవైపు సామాజిక సంస్థలతో కలిసి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం గమనార్హం. స్వచ్ఛంద సంస్థలతో కలిసి రక్తదాన శిబిరాలు, ప్లాస్మా దానం, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇక కాలేజీల్లో చదివే విద్యార్థినులకు ఉన్నత చదువులు, పరీక్షలకు తయారయ్యే విధానం గురించి క్లాసులు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత బూత్ బంగ్లాగా ఉన్న స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని చక్కగా తీర్చిదిద్దే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.



రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు అందుకుంటున్న సబ్ రిజిస్ట్రార్

యోగాలో మేటి రమాదేవి

- క్యాన్సర్ మూలల నుంచి బయటపడేందుకు యోగా నేర్చుకున్న వైనం
- తర్వాత డిప్లొమా, డిగ్రీ చేసి గురువుగా..
- మహిళలకు మనోధైర్యాన్ని నింపుతున్న యోగా గురువు



తుమ్మపాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):

యోగాలో ప్రతిభను కనబరిచి పలు అవార్డులు, రివార్డులు అందుకుంటూ.. మరోవైపు ఆర్థికంగా కుటుంబానికి ఆసరాగా నిలిచింది తుమ్మపాల విద్యుత్‌నగర్ చెందిన రమాదేవి. తనకొచ్చిన రోగాన్ని నయం చేసుకోవడానికి యోగా నేర్చుకున్న ఆమె అదే రంగంలో రాణిస్తూ ఎందరో మహిళలకు మనోధైర్యాన్ని నింపుతోంది.



యోగాలో శిక్షణ అందిస్తున్న రమాదేవి

అనకాపల్లి జిల్లా నర్సీపట్నం పెదబొడ్డేపల్లి గ్రామానికి చెందిన రమాదేవి అనకాపల్లి తుమ్మపాల విద్యుత్‌నగర్ ప్రాంతానికి చెందిన కరణం ఈశ్వరరావును 2006లో వివాహం చేసుకుంది. 2007లో రమాదేవి ఒక ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తన ఆరోగ్యం కుంటుపడడం ప్రారంభమైంది. దీంతో కుటుంబసభ్యులు వైద్యులను సంప్రదించగా శరీరంలో క్యాన్సర్ మూలాలు ఉన్నాయని, తక్షణమే వైద్య ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. అయితే ప్రముఖ యోగా గురువు కరణం బాబురావు సూచనల మేరకు రమాదేవి యోగా సాధనను ప్రారంభించింది. అతి కొద్దికాల వ్యవధిలోనే యోగాలో కఠోర సాధన చేసి తన శరీరంలో ఉన్న క్యాన్సర్ మూలాలను తరిమికొట్టింది. దీంతో రమాదేవి సంపూర్ణ ఆరోగ్యవంతురాలైంది. కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో డిగ్రీని పూర్తి చేయడంతోపాటు యోగాలో డిప్లమో, పీజీని పూర్తి చేసింది. ప్రస్తుతం తుమ్మపాల యోగా లైఫ్ సెంటర్‌లో యోగా గురువుగా కొనసాగుతోంది. నెలకు రూ.1500లు గౌరవ వేతనంతో ప్రారంభమైన రమాదేవి ప్రతి నెలా రూ. 35 వేలు నుంచి రూ.40వేల వరకు సంపాదిస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. ప్రతి రోజు వంద మందికి పైగా మహిళలు, పిల్లలకు యోగాలో శిక్షణ అందిస్తూ మన్ననలు పొందుతోంది. అనారోగ్య సమస్యలతో వస్తున్న వారికి మనోధైర్యాన్ని నింపుతున్నది. సంతానలేమితో వచ్చే వారికి కొన్ని ప్రత్యేకమైన ఆసనాలు భార్యాభర్తలతో వేయించడంతో సంతానం కూడా కలుగుతుంది. ఇప్పటికే ఎనిమిది మంది సంతానం ఆమె వద్ద శిక్షణ తీసుకొని సంతానాన్ని పొందారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సైతం రమాదేవిని అభినందిస్తున్నారు. ప్రముఖ వైద్యురాలు, మాజీ ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, డాక్టర్ విష్ణుమూర్తి తదితర వైద్యులు రమాదేవి వద్దే యోగాలో శిక్షణ పొందుతున్నారు.

సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యం

కరణం రమాదేవి, యోగా గురువు

ప్రస్తుత సమాజంలో అనారోగ్యాలతో నలిగిపోతున్న వారు, మానసికంగా కృంగిపోతున్న వారికి మనోధైర్యాన్ని కల్పించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం. ఇప్పటికే వందలాది మందికి యోగాలో శిక్షణ ఇచ్చి వారికి ఉన్న శరీర బలహీనతల నుంచి విముక్తులను చేశాను. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాను. దీనికి సంబంధించి కుటుంబం అందిస్తున్న ప్రోత్సాహం ఎనలేనిది. అలాగే మరింత మంది యోగా శిక్షకులను తయారు చేస్తున్నాను.





హస్తకళల్లో రాణిస్తున్న అతివలు



కళాఖండాలకు సహజ సిద్ధ రంగులు వేస్తున్న మహిళలు

- లక్కబొమ్మల తయారు చేస్తూ కుటుంబాలకు అండగా నిలిచిన మహిళలు
- పురుషులకు దీటుగా అంకుడు కర్రతో అద్భుత కళాఖండాల తయారీ



ఏటికొప్పాకలో అంకుడు కర్రతో హస్త కళాఖండాలు తయారు చేస్తున్న మహిళలు

ఎలమంచిలి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):

అంకుడు కర్రతో సహజ సిద్ధ రంగుల మేళవింపుతో వివిధ రూపాల్లో లక్కబొమ్మల తయారీలో దేశంలోనే ఏటికొప్పాక హస్త కళాకారులు ప్రత్యేకత చాటుకున్నారు. ఇక్కడి పురుషులకు దీటుగా మహిళలు సైతం రాణిస్తున్నారు.

అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలంలోని ఏటికొప్పాకలో ఒకప్పుడు హస్తకళా రంగంలో పురుషులే రాణించేవారు. ఇక్కడి కళాకారులు తయారు చేసిన కళాఖండాలకు రాష్ట్ర, జాతీయ అవార్డులు దక్కించుకున్న వారెందరో ఈ గ్రామంలో ఉన్నారు. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు పురుషులతో సమానంగా లక్కబొమ్మల తయారీలో పోటీపడుతున్నారు. పురుషులతో సమానంగా మహిళలు మిషన్‌పై అంకుడు కర్రను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది హస్త కళారూపాలను తయారు చేస్తున్నారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత శ్రీశైలపు చిన్నయాచారి నెలకొల్పిన హస్తకళా కేంద్రంలో మహిళలు శిక్షణ పొంది నేడు తమ కాళ్లమీద తాము నిలబడే స్థాయికి ఎదిగారు. కుటుంబ ఆర్థిక వ్యవస్థలో కీలకంగా మారారు. ఏటికొప్పాకలో 200 మంది మహిళలు లక్కబొమ్మల తయారీలో నిలదొక్కుకుని కుటుంబ పోషణలో కీలకభూమిక పోషిస్తున్నారు. వీరు నెలకు రూ. 6 వేల నుంచి రూ.15 వేలు సంపాదిస్తున్నారు. సరదాగా నేర్చుకున్న విద్య ఇప్పుడు కుటుంబ పోషణకు ఎంతగానో ఉపయోగపడుతుందని పలువురు మహిళా కళాకారిణిలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే మరిన్ని అద్భుతాలు సాధిస్తామని వీరు అంటున్నారు.

భర్త లేని కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను



తాను 8 సంవత్సరాలుగా లక్క బొమ్మల తయారీ పనిలో పనిచేస్తున్నాను. భర్త లేని కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. ఇద్దరు కుమార్తెలను పోషిస్తున్నాను. ఒకప్పుడు సరదాగా నేర్చుకున్న పనే నా కుటుంబానికి జీవనాధారమైంది.

సియ్యాదుల లక్ష్మి

తానే కుటుంబానికి ఆధారం..



లక్కబొమ్మలు తయారు చేసే పనిని పదేళ్ల క్రితం నేర్చుకున్నాను. భర్త లేని కుటుంబాని నెట్టుకొస్తూ నా కుమారుడు, కుమార్తెను చదివిస్తున్నాను. నా కాళ్ల మీద నేను నిలదొక్కుకుంటున్నాను. నా చేతిలో తయారవుతున్న లక్కబొమ్మలను చూసి ఎంతో గర్వపడతాను.

చింతల లావణ్య

3 సంవత్సరాలుగా రాణిస్తున్నాను



ఇంటర్ వరకూ చదువుకున్న తర్వాత వివాహం చేసుకున్నాను. తన భర్త ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. తాను నేర్చుకున్న లక్కబొమ్మల తయారీలో నెలకు రూ. ఆరు వేలకు పైబడి సంపాదిస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాను.

సీహెచ్.రాజేశ్వరి

శారదా నదిలో గల్లంతైన యువకుడి మృతి



మణికంఠ(ఫైల్‌ఫొటో)

రాంబిల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు వద్ద మైనర్ శారదా నదిలోకి స్నానానికి దిగి గల్లంతైన యువకుడు గాదిరాయి మణికంఠ (18) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వి.మాడుగుల మండలం గాదిరి గ్రామానికి చెందిన మణికంఠ విశాఖపట్నం జిల్లా గోపాలపట్నంలోని హాస్టల్‌లో ఉంటూ ఐటీఐ చదువుతున్నాడు. ఈనెల 6న మణికంఠ మరో ఇద్దరు స్నేహితులతో కలిసి రాంబిల్లి మండలం గోకివాడలోని ఒక వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. వీరితోపాటు మరో ఇద్దరు కలిసి సాయంత్రం 5 గంటల ప్రాంతంలో కొత్తూరు సమీపంలోని మేజర్ శారదా నదిలో స్నానానికి దిగగా మణికంఠ గల్లంతయ్యాడు. దీంతో తోటి యువకులు గాలించినా ఆచూకీ కానరాకపోవడంతో మణికంఠ కుటుంబీకులు, హాస్టల్‌కు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం సీఐ నర్సింగరావు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఈతగాళ్ల మృతదేహాన్ని తీయించారు. అనంతరం మృతదేహాన్ని అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు సీఐ నర్సింగరావు తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

వెంకన్న ఉత్సవాలకు భారీ బందోబస్తు : ఎస్పీ



ఏర్పాట్లుపై పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

నక్కపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉపమాక వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు 300 మంది పోలీస్‌లతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ తుహిన్ సిన్హా చెప్పారు. శుక్రవారం ఉపమాక వెంకన్న ఆలయాన్ని ఆయన తనిఖీ చేశారు. భక్తుల రద్దీ వుండే క్యూ లైన్లు, కొండపైకి వెళ్లే మెట్ల మార్గం, తదితర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు కుమారస్వామి, ఎల్.రామకృష్ణలను ఆదేశించారు. భక్తుల భద్రత కోసం మఫ్టీలో సిబ్బంది పహారా కాస్తారన్నారు. భక్తుల రద్దీ క్రమబద్ధీకరణ కోసం డ్రోన్లను వినియోగించాలని సూచించారు. నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సభకు సంబంధించి ఏర్పాట్లను ఎస్పీ తుహిన్ సిన్హా పరిశీలించారు.

ఇద్దరు అధికారులపై చర్యలకు ఆదేశం

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా నర్సీపట్నం గ్రామీణ నీటి సరఫరా విభాగం సబ్ డివిజన్‌లో బోరు బావుల తవ్వకం, పైపుల బిగింపులో అక్రమాలకు పాల్పడిన ఘటనలో ఇద్దరు అధికారులపై శాఖాపరమైన చర్యలకు ప్రభుత్వం ఆదేశించింది. నర్సీపట్నం సబ్ డివిజన్‌లో బోర్‌వెల్స్ తవ్వకం, పైపుల ఏర్పాటుకు సంబంధించి నకిలీ ధ్రువపత్రం మేరకు బిల్లులు చెల్లించారనే అభియోగంపై అప్పటి డీఈ కె.రామస్వామి (ప్రస్తుతం రిటైరయ్యారు), అప్పటి జేఈ, ప్రస్తుత డీఈ ఎం.జయరాంపై చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

కృషి, పట్టుదలతో విజయ పథం

... 5వ పేజీ తరువాయి

నిరుపేదలకు చేర్చడానికి కృషి చేస్తున్నారు. తరచూ ఏదో ఒక గ్రామాన్ని సందర్శిస్తూ, ప్రజలతో మమేకమవుతున్నారు. వారి సమస్యలు, కష్టనష్టాలను తెలుసుకొని ప్రభుత్వ పరంగా పరిష్కారానికి పాటుపడుతున్నారు. ముఖ్యంగా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం పరితపిస్తున్నారు.

జిల్లాలో రావికమతం, రోలుగుంట మండలాల్లో లోసింగి, కొత్తలోసింగి, వైబీ పట్నం గిరిజన గ్రామాలకు కాలినడకన వెళ్లి ఆదివాసీలతో మమేకమయ్యారు. వారి కష్టాలను తెలుసుకుని, సహపంక్తి భోజనం చేశారు. మహిళల ఆర్థిక స్వావలసంబన కోసం, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కోడూరులో ప్రత్యేకంగా 32 ఎకరాల్లో పారిశ్రామిక హబ్ ఏర్పాటుకు భూసేకరణ జరిపి ప్రభుత్వానికి పంపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ, మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలన్నారు. జీవితంలో ఏదైనా సాధించాలనే తపనతో లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు.

ప్రతి తల్లి తన కుమారులతోపాటు కుమార్తెలను కూడా సమానంగా చూడాలని, వివక్ష చూపకపోతే సమాజంలో ఇబ్బందులు ఉండవన్నారు. ఎవరో ఏదో అనుకుంటారనే భావనను వదిలి ప్రతి మహిళా ఆర్థికంగా ఎదిగేందుకు ప్రయత్నించాలని కోరారు. ఈ సందర్భంగా అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

సీఎస్ఆర్ నిధులు మెక్కేశారు!

... 5వ పేజీ తరువాయి

కేటాయించింది. ఈ చెరువు చుట్టూ అపార్ట్‌మెంట్లు కూడా నిర్మితమయ్యాయి.

ఇంకా రామన్నపాలెంలో బంగారయ్య చెరువుకి రూ.35 లక్షలు (రాజకీయ కారణాలతో రూ.25 లక్షల విలువైన పనులు మాత్రమే చేశారు), భోగాపురంలో కర్రివాని చెరువుకి రూ.15.5 లక్షలు, జంగులూరులో ఊర చెరువుకు రూ.15 లక్షలను మట్టితీత పనులకు మంజూరు చేయించారు. చెరువుల్లో తీసిన పూడిక మట్టిని ఎస్ఈజడ్‌లో నిర్మాణంలో వున్న కర్మాగారాలతోపాటు రియల్ ఎస్టేట్ వెంచర్లను అభివృద్ధి చేయడానికి అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. వైసీపీ అధికారంలో వున్నప్పుడు ఆ పార్టీకి చెందిన నియోజకవర్గం ముఖ్యనేత ఒత్తిడితోనే ఏషియన్ పెయింట్స్ కర్మాగారం సీఎస్ఆర్ నిధులను చెరువుల్లో పనులకు విడుదల చేసినట్టు తెలిసింది.



సీఎస్ఆర్ నిధులు రూ.35 లక్షలు ఖర్చు చేసిన రామన్నపాలెం బంగారయ్య చెరువు

ఆ సొమ్ముతో వాటర్ ప్లాంట్లు పెట్టుంటే..

జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజవకర్గం (జడ్పీటీసీ) సభ్యుడు లాలం రాంబాబు స్వగ్రామం భోగాపురం. ఇక్కడ భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉండడంతో ప్రజలు కిడ్నీ సంబంధ వ్యాధులబారిన పడుతున్నారు. గత ఎనిమిదేళ్లలో ఈ గ్రామంలో 17 మంది కిడ్నీ వ్యాధితో చనిపోయారరు. ఇంకా పలువురు ఈ వ్యాధితో బాధపడుతున్నారు. దీంతో కొంతమంది ఇళ్లను ఖాళీ చేసి అచ్యుతాపురంలో ఇళ్లను అద్దెకు తీసుకుని నివాసం వుంటున్నారు. ఏషియన్ పెయింట్స్ ఇచ్చిన నిధులను (రూ.15.5 లక్షలు) ఎవరికీ ఉపయోగం లేని చెరువులో పూడిక తీత పనులకు వినియోగించారని, ఆ నిధులతో గ్రామంలో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి వుంటే గ్రామస్థులు కిడ్నీ సంబంధ వ్యాధి నుంచి బయటపడేవారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

టీచర్ల సీనియారిటీ జాబితాలో తప్పులు

... 5వ పేజీ తరువాయి

కార్యాలయంలో ఉంటాయి. ఆ వివరాలకు జడ్పీ, మునిసిపల్ పాఠశాలల్లో పనిచేసిన కాలాన్ని కలిపి సీనియారిటీ ఖరారు చేయాలి. కానీ ఆ విధంగా చేయకపోవడంతో వారంతా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయాన్ని కొందరు టీచర్లు డీఈవో దృష్టికి తీసుకువచ్చారు. సాధారణంగా ఉపాధ్యాయుల నియామక సమయంలోనే రోస్టర్ కమ్ మెరిట్ జాబితా రూపొందించి దాని ప్రకారమే ఉద్యోగాలు ఇస్తారు. ఆ ప్రకారమే పదోన్నతులు ఇవ్వాలి. కానీ విద్యాశాఖలో కొందరు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా 1994 నుంచి 2018 వరకూ జరిగిన డీఎస్సీలకు సంబంధించి మెరిట్ కమ్ రోస్టర్ జాబితాల ఆధారంగా ప్రస్తుతం సీనియారిటీ జాబితా తయారు చేయలేదని టీచర్లు మండిపడుతున్నారు. జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ఒక ఉద్యోగి (డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న టీచర్) నిర్వాకంతో మెరిట్ కమ్ రోస్టర్ జాబితాలు కొన్ని కనిపించడం లేదని, అందుబాటులో ఉన్న జాబితాలను కూడా పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపిస్తున్నారు.

జీవీఎంసీ విద్యా విభాగం నిర్వాకంతో నగరంలో మునిసిపల్ పాఠశాలల టీచర్ల సీనియారిటీ వివరాలు మొత్తం తప్పులతడకగా ఉన్నట్టు పలువురు టీచర్లు ఆరోపిస్తున్నారు. వాటిని ఒకటికి రెండుసార్లు పరిశీలించకుండా ఇప్పుడు జాబితా తయారుచేశారనే వాదన ఉంది. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో సీనియారిటీ జాబితాలో జూనియర్ల పేర్లు ముందుండి తరువాత సీనియర్ల పేర్లు ఉన్నాయని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

కాగా సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలను విశాఖ డీఈవో కార్యాలయంలో స్వీకరిస్తున్నారు. జిల్లాల విభజన జరిగినా అల్లూరి, అనకాపల్లి జిల్లాల నుంచి టీచర్లు విశాఖ రావాల్సి వస్తుండడంపై సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

కొత్త జిల్లాల వారీగా అభ్యంతరాలు స్వీకరించి అక్కడ నుంచి వాటిని విశాఖకు పంపాలని కోరుతున్నారు. సీనియారిటీ జాబితాపై టీచర్ల నుంచి అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల పదో తేదీ వరకూ ఇచ్చిన గడువును పెంచాలని కోరుతున్నారు. జాబితాలో తప్పులు సవరించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు, యూటీఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ వేర్వేరుగా డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు.